

## దళితబంధు రాలేదని వ్యక్తి ఆత్మహత్యా యత్నం

**నవతెలంగాణ టేక్మాల్:** ఆరోగ్యం క్షీణించి అంగవైకల్యం ఏర్పడి మానసిక క్షోభ అనుభవిస్తున్న తనకు దళిత బంధు మంజూరు చేయకుండా ఆర్థికంగా అంగ బలం ఉన్న టీఆర్ఎస్ కార్యకర్తలకు దళిత బంధు ఇస్తారా? అని టేక్మాల్ మండలం సాలూరుపల్లి గ్రామానికి చెందిన బేగరి దేవయ్య యాసిడ్ తాగి సీఎం కేసీఆర్ మీటింగ్ వెళ్తున్న బస్సుకు అడ్డంగా పడుకున్నాడు. సాలోజి పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి దేవయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తన అనారోగ్యాన్ని చూసిన భార్య వదిలేసి వెళ్లిపోయిందని, తన కుమారుని చదువు ఆపి సేవలు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తన కుమారుడి భవిష్యత్తుకు ఉపయోగపడి తన అంగవైకల్యం జయించి తనకాళ్ల మీద తాను నిలబడడం కోసం దళిత బంధు కేటాయించాలని వేడుకున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. యాసిడ్ తాగి కేసీఆర్ మీటింగ్ వెళుతున్న బస్సుకు అడ్డంగా కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని టేక్మాల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప ఆసుపత్రికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.

# తెలంగాణలో గణనీయమైన అభివృద్ధి

- స్వరాష్ట్రంలో అభివృద్ధికి తార్కాణమే ఐడీఓసీలు
- కొన్ని రాష్ట్రాల సచివాలయాల కంటే మన ఐడీఓసీలే పెద్దవి
- సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు







**నవతెలంగాణ - మెదక్**

'తెలంగాణలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. స్వరాష్ట్రంలో అభివృద్ధికి తార్కాణమే ఐడీఓసీలు. కొన్ని రాష్ట్రాల సచివాలయాల కంటే మన ఐడీఓసీలే పెద్దవి' అని సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, పోలీస్ కార్యాలయాన్ని, సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రారంభించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. తెలంగాణ వస్తే పాలన చేతగాదని ఎద్దేవా చేసినోళ్లే.. రాష్ట్ర అభివృద్ధిని చూసి శ్లాఘిస్తున్నాయన్నారు. అభివృద్ధికి కొలమానంగా భావించే తలసరి ఆదాయం, జీడీపీ, తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ నెంబర్-1 గా నిలిచిందని చెప్పారు. కొన్ని రాష్ట్రాల సచివాలయాల కంటే తెలంగాణాలోని ఐడిఓసిలే పెద్దవి అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అనతి కాలంలోనే అభివృద్ధి చెందినదని, దాదాపు 60, 70 ఏండ్ల క్రితం ఏర్పాటైన ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో అభివృద్ధి గణనీయంగా జరిగిందన్నారు. కేవలం తొమ్మిదిన్నర ఏండ్లలోనే రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునే స్థాయికి ఎదిగిందని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో సరైన అసెంబ్లీ, సెక్రెటేరియట్ కూడా లేవన్నారు. తెలంగాణాలో 33 జిల్లాలను ఏర్పాటు చేసుకోవడమే కాకుండా 24 సమీకృత కలెక్టరేట్‌లను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నూతన కలెక్టరేట్‌ను, ఎస్పీ కార్యాలయాన్ని నిర్మించుకున్నందుకు మెదక్ జిల్లా ప్రజలకు సీఎం అభినందనలు తెలియజేశారు. మెదక్ కలెక్టరేట్ ఆర్కిటిక్చర్ ఉషారెడ్డి తెలంగాణ బిడ్డేనని.. సీఎం కేసీఆర్ ఆమెను అభినందనందించారు. అన్ని జిల్లాల్లో నిర్మించుకున్న ఈ పరిపాలనా భవనాలు చూస్తేనే రాష్ట్ర అభివృద్ధి గురించి తెలిసిపోతుందన్నారు. దేశంలో తెలంగాణ నెంబర్ వన్ రాష్ట్రంగా ఉన్నదని, స్వచ్ఛమైన నీటిని ఇంటింటికి అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని చెప్పారు. అలాగే అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. గతంలో 23 లక్షలు మాత్రమే పెన్షన్ లు ఉండేవని, ప్రస్తుతం 54 లక్షల పెన్షన్ దారులు ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో ఆర్థిక పరిస్థితి మెరుగవ్వగానే మరింత పెన్షన్ మొత్తం పెంచుతామన్నారు. ఘనపురం ఆయకట్టు ఎలా బాగు చేసుకున్నామో అందరికీ తెలుసన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్ట్ లు త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. మంజీర లో అనేక చెక్ డ్యాం లు కట్టుకున్నామని, ఫలితంగా 365 రోజులు మంజీర జలకలను సంతరించుకుందని తెలిపారు. మెదక్ పచ్చని పంట పొలాలతో అలరాలుతుందన్నారు. మెదక్ ను రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ... స్వరాష్ట్రంలో ఇప్పటికే కొత్తగా నిర్మించిన 23 ఐడిఓసీ లు ప్రారంభించడం జరిగిందన్నారు. మెదక్ లో 24 వ ఐడిఓసి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఐడిఓసి నిర్మాణంతో అన్ని సేవలు ఒకే చోట లభిస్తాయన్నారు. తాను ఇక్కడే వివిధ హోదాల్లో నాలుగేళ్ల పని చేసినట్లు తెలిపారు. స్వరాష్ట్రంలో సిఎం కేసిఆర్ సారథ్యంలో తెలంగాణ అగ్ర స్థానంలో నిలిచిందన్నారు. తలసరి ఆదాయం, తలసరి విద్యుత్ వినియోగం లో తెలంగాణ నెంబర్1 నిలిచిందన్నారు. దేశంలో అత్యధిక వేతనాలు పొందుతున్నది తెలంగాణనే అని చెప్పారు. ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ స్టేట్ గా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణ ప్రత్యేక ఇంక్రిమెంట్, రెండు సార్లు వేతన సవరణ, వీఆర్ఏ లకు ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించి పే స్కేల్ అమలు చేయడం, పెద్ద ఎత్తున పంచాయితీ సెక్రటరీల నియామకం, జేపీఏ ల క్రమబద్ధీకరణ సహా అనేక కార్యక్రమాలు ఉద్యోగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం సిఎం మెదక్ జిల్లా అధికారులతో గ్రూప్ ఫోటోదిగారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ శాసన సభ్యురాలు పద్మాదేవేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, ఎంపీ లు కొత్త ప్రభాకర్ రెడ్డి, బిబి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

**మెదక్ జిల్లాకు వరాలు: సీఎం కేసీఆర్**

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

మెదక్ జిల్లా అభివద్ధి కోసం సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నా బిడ్డ. ఉద్యమం నుంచి ఉంది. జెడ్పీటీసీ నుంచి అనేక పనులు చేస్తున్న బిడ్డ. నియోజకవర్గం అభివద్ధి కోసం ఎంతో కష్టపడుతున్నారు. ఇంద్ర భవనం లాంటి కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ నిర్మాణం పూర్తి చేయించారు. జిల్లాలో గ్రామ పంచాయతీలకు డబ్బులు అడిగారు. ఆమె కోరిక మేరకు మెదక్ జిల్లా అభివద్ధి కోసం నా వంతు కషిగా కొన్ని పనులు చేయాల్సిన బాధ్యత ఉంది. ప్రజల అవసరాల కోసం రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఎల్లుండే జీవో ఇస్తా. రామాయణపేటకు ఒక డిగ్రీ కళాశాల. కౌడిపల్లిలో మరో డిగ్రీ కళాశాల మంజూరు చేస్తా. మెదక్ జిల్లా అభివద్ధి కోసం రింగ్ రోడ్డు మంజూరు చేశాను. ఏడుపాయల టెంపుల్ అభివద్ధి కోసం గతంలో ఇచ్చిన టూరిజం ప్యాకేజీ కింద రూ.600 కోట్లను కేటాయిస్తున్నా' అని సీఎం కేసీఆర్ తెలిపారు. జిల్లాలోని 469 గ్రామపంచాయతీ కోసం ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.15 లక్షల చొప్పున నిధులను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. మెదక్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, నర్సాపూర్ తూప్రాన్ రామాయణపేట మున్సిపాలిటీలకు రూ.25 కోట్లు చొప్పున నిధులు ఇస్తున్నామని సీఎం ప్రకటించారు. 'దేశంలో కోటి 3 లక్షల మందికి నీళ్ల ఇచ్చిన రాష్ట్రం తెలంగాణను దుర్మార్గులకు, చేతకాని వారికి అప్పగిద్దామా? కాంగ్రెస్ చెప్పుంది.. ధరణీ తీసేస్తామని, ఎందుకు అలా.. గ్రామం నుంచి సీసీఎల్ఏ వరకు ఉంది. భూమిని ఇక ఎవరు మార్చ లేరు. మీ బొటన వెళుతోనే. ధరణి ఉండాలా .. వద్దా? కాంగ్రెస్ హయాంలో ఏ రైతుకు రూ.50 వేలు రాలేవు. ఇప్పుడు రైతు బీమా చేశాం. ఇంగ్లాండ్‌లో లేదు. ఏ రాష్ట్రం లో లేవు. రైతుబీమా డబ్బులు నేరుగా బ్యాంక్‌లోకి వస్తున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం రుణ మాఫీ చేశాం. 37 వేల కోట్లు చేశాం. ధరణి ద్వారా వచ్చిన అకుంట్ రికార్డుల ఆధారంగా బ్యాంక్ లో జమ అవుతున్నాయి. ఒక్క రూపాయి లంచం లేకుండా వస్తున్నాయి. ధరణి వద్దన్న వారిని బంగాళా కథంలో పడేయాలి' అని రైతులకు సూచించారు. 'వరి ధాన్యంలో పంజాబ్‌ను తలదన్నాం. రైస్ మిల్లులు సరిపోవడం లేదు. ఎక్కడ చూసినా రోడ్డుపై కల్లాలే. పదేళ్ల కింద ఏముందీ.. ఈ రోజు పారదర్శకంగా ఉన్నాము. దేశానికే తలమానికంగా ఉన్న ఈ రాష్ట్రం. ఎక్కడ పోయినా బ్రహ్మరథం పడుతున్నారు. ఇది కాపాడుకోవాలి. పద్మకు మరోసారి టిక్కెట్ ఇచ్చాం. రెట్టింపు మెజారిటీతో గెలిపించాలి. సిద్దిపేటలా మెదక్ తయారు చేస్తాం' అని తెలిపారు.

**విపక్ష నాయకుల ముందస్తు అరెస్ట్**

సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించిన సందర్భంగా సీపీఐ(ఎం), కాంగ్రెస్, బీజేపీ నాయకుల్ని పోలీసులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

## 28, 29న సీపీఐ(ఎం) జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు

**సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి**

**నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిద్దిపేట జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఈ నెల ఆగస్టు 28, 29వ తేదీలలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని, ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాద విధానాలను అనుసరిస్తూ దేశ లౌకిక తత్వానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అనేక చట్టాలు మార్పులు తీసుకువస్తూ ప్రజల మధ్య విభజనలు తీసుకువస్తున్నారని తెలిపారు. పార్లమెంటులో సైతం మందబలంతో అనేక ప్రజా వ్యతిరేక చట్టాలను చేస్తూ పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను హరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మారుస్తున్నారని అన్నారు. మణిపూర్ లాంటి ఘటనలు పార్లమెంటులో చర్చ చేయకుండా, బయట సమాజానికి కూడా తెలియకుండా ఇంటర్నెట్ కట్ చేసి అరాచకం సృష్టిస్తున్నారని తెలిపారు. మణిపూర్‌లో మంటలు రేపుతున్నారని విమర్శించారు. అమాయక గిరిజన తెగలు, ప్రజలపై దాడులు చేసి హత్యలు, అత్యాచారాలు చేసి చంపినా పట్టించుకునే నాథుడు లేడని, అక్కడి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. పార్లమెంటులో సంఖ్య ఉందని అనేక ప్రజావ్యతిరేక చట్టాలను రూపొందించి చట్టాలలో మార్పులు చేసి ప్రజా వ్యతిరేక పాలన దేశంలో మతతత్వానికి వ్యతిరేకంగా ప్రజలందరిని సమీకరించి మతసామరస్యం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, లౌకిక తత్వాన్ని కాపాడాలని పెద్ద ఎత్తున ఉద్యమాలకు రూపకల్పన చేయడం కోసం ఈ శిక్షణా తరగతుల్లో కార్యకర్తలను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం వివరిస్తున్న తీరు ఎన్నికల్లో వాళ్ళు తీసుకుంటున్న నిర్ణయాలు మతోన్మాద శక్తులకు ఊతం ఇచ్చే విధంగా ఉందన్నారు. అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాల వల్ల పేదలపై అనేక భారాలు వేసి పెట్టుబడుదారులు, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు నెరవేర్చే విధంగా వారికి రాయితీలు ఇస్తూ పేదల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ కార్యకర్తలను రాజకీయంగా చైతన్యవంతం చేయడానికి సైద్ధాంతికంగా అభివృద్ధి చేసుకోవడానికి, రానున్న ఎన్నికల్లో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను పెంపొందించే విధంగా బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించడానికి జిల్లాస్థాయి నాయకత్వ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ తరగతులకు జిల్లా వ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాల స్వామి, రాళ్ల బండి శశిధర్, మాజీ జెడ్పిటిసి దాసరి కళావతి, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు కనీస వేతనం పెంచాలి

**నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్**

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు 18 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారని తెలిపారు. రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం. ఆన్లైన్ పనిచేయడం. బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారని తెలిపారు. 'గర్భిణి, బాలింతలు, చిన్న పిల్లలకు, ఇతర ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కరోనా మహమూరి కాలంలో కరోనను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారు. డబ్ల్యూహెచ్ఓ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశ వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించింది. ఇన్ని పనులు నిర్వహిస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశలకు నేటికీ కనీస వేతనములు నిర్ణయం చేయకపోవడం వలన ఆశా వర్కర్లు అన్యానికి గురవుతున్నారు. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశా వర్కర్లకు పనిభారం విపరీతంగా పెరిగింది. పారితోషికంతో పాటు పారితోషికాలు లేని అనేక పనులను ప్రభుత్వం ఆశలతో పని చేయిస్తున్నది. ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సబ్ సెంటర్స్. బస్తి దవాఖానాలో పని చేయాలని ఆశలకు ప్రభుత్వం చెబుతున్నది. ఇంత పని చేస్తున్న ఆశలకు కేవలం రూ.9750 పారితోషికం మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఒకవైపు పనిపురం పెరిగింది. మరొక్క వైపు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వచ్చే పారితోషికాలు సరిపోక ఆశా వర్కర్లు మేక ఇబ్బందులకు గురవుతున్నారు, ఆశల పారితోషకాలను రూ.26



వేలకు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించాలి' అని డిమాండ్ చేశారు. కరోనా రిస్క్ అలోవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయిలు డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. ఆశాల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రవీణ, అధ్యక్షురాలు మంజుల,భాగ్యలక్ష్మి, బాలమని, నీరజ,సుజాత, శ్యామల, బాలమణి, వివిధ గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్న పరిశ్రమల అభివద్ధికి కేంద్రం చేయూత

**కేంద్ర మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ**

**నవతెలంగాణ-రామచంద్రాపురం**



కేంద్ర ప్రభుత్వం చిన్న పరిశ్రమల అభివద్ధికి ఎన్నో రాయితీలు, ఆర్థిక సహాయం అందిస్తున్నదని సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ తెలిపారు. రామచంద్రపురం పట్టణంలోని బీజేపీ రాష్ట్ర నాయకులు అంజిరెడ్డి నివాసానికి కేంద్రమంత్రి బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. దేశంలోని చిన్న పరిశ్రమల అభివద్ధికి కేంద్రం ఎన్నో రకాల పథకాలను రాయితీలను రుణాలను అందజేస్తున్నదన్నారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ కింద దరఖాస్తు చేసుకున్న పేదవారికి లక్ష రూపాయలు నుండి రెండు లక్షల రూపాయల వరకు తక్కువ వడ్డీతో బ్యాంకుల నుండి రుణాలను ఇప్పించి వ్యాపారాలు సైతం చేసుకునేందుకు 18 కుల వత్తుల వారికి కేంద్రం సహాయం అందిస్తున్నదన్నారు. 50వేల కోట్ల రూపాయలు వెచ్చించి చిన్న పరిశ్రమల అభివద్ధికి చేయూతనిస్తూ లక్షల మందికి ఉపాధిని, జీవనాధారాన్ని కల్పిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ అంగవైకల్యం వారికి ప్రత్యేక సబ్సిడీలు, రాయితీలు కల్పిస్తూ వారి అభివద్ధికి సైతం ఎంతగానో సహాయపడుతున్నామన్నారు. పటాన్చెరు ప్రాంతంలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయని వాటి అభివద్ధి కోసం పథకాలు, బ్యాంకుల ద్వారా రుణాలు సక్రమంగా చేరుతున్నాయో లేదో తెలుసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకురాలు గోదావరి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మకానికి మారుపేరు కేసీఆర్

**రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు**

**నవతెలంగాణ - మెదక్**

నమ్మకానికి మారుపేరు సీఎం కేసీఆర్ అయితే అమ్మకానికి మారుపేరు విపక్షాలని రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు పేర్కొన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని సిఐఎస్ఎఫ్ చర్చి కాంపౌండ్ గ్రౌండ్‌లో జరిగిన సీఎం బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ వడ్లు పుట్ల కొద్ది పండించి దేశంలో ధాన్య బాండాగారంగా తెలంగాణను తీర్చిదిద్దారని తెలిపారు. కేసీఆర్ అంటే ఒక నమ్మకం అని, రాదనుకున్న తెలంగాణను తెచ్చారని, రాదనుకున్న కాళేశ్వరం జలాలను తీసుకొచ్చి సస్యశ్యామలం చేశారని తెలిపారు. 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తా అంటే అప్పట్లో జానారెడ్డి విమర్శించినట్లు గుర్తుచేశారు. కానీ అందరి ఎమోషనల్ తప్పికొడుతూ సీఎం కేసీఆర్ గత తొమ్మిదేళ్లగా 24 గంటల కరెంట్ ఇస్తున్నట్టు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు బంధు, రైతు భీమా, కళ్యాణలక్ష్మి వంటి ఎన్నో పథకాలను ప్రజలకు చేరువ చేశారని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసే పరిస్థితి లేని బిజెపి, కాంగ్రెస్ వాళ్ల తిట్ల పురాణాలే వినిపిస్తున్నాయన్నారు. ఇందిరా గాంధీ మాట ఇచ్చి తప్పిన మెదక్ జిల్లా కేంద్రం, రైలు కలను సీఎం కేసీఆర్ నెరవేర్చారని తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రం, రైల్వే విషయంలో కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే ఎస్పి, కలెక్టర్, బీఆర్ఎస్ కార్యాలయాలను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో మంజీర, హెల్దీ చెక్ డ్యామ్ లను ఏర్పాటు చేసుకోవడంతో వ్యవసాయానికి సాగు నీళ్ళు వచ్చాయన్నారు. మెదక్ అభివృద్ధి దిశగా అభివృద్ధి చెందుతుందని, చెరువులు, చెక్ డ్యాంలు, కాళేశ్వరం వంటి ఎన్నో పనులను పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. సమైక్య పాలనలో కనీసం తిండి దొరకని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పుడిప్పుడే



అభివృద్ధి చెందుతూ పూర్వ వైభవం వస్తుందన్నారు. ప్రతిపక్షాలవి అబద్ధాల ప్రచారమని, రేపు రాబోయే ఎన్నికల యుద్ధంలో బీఆర్ఎస్ అభివృద్ధి కనిపిస్తాదని తెలిపారు.

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ జయప్రదం చేద్దాం

**ప్లీనరీ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు చుక్కా రాములు**



**నవతెలంగాణ-పటాన్‌చెరు**

వచ్చేనెల 8 నుంచి సంగారెడ్డిలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్లీనం ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో చుక్కా రాములు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యరంగ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ అనునిత్యం పోరాడుతున్నదన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐఅనునిత్యం విద్యార్థుల పక్షాన నిలబడుతున్నదన్నారు. ప్లీనరీ సమావేశాల్లో గత కార్యక్రమాలు, విద్యా రంగంలో పాలకులు తీసుకువస్తున్న విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు జాతీయ అధ్యక్ష కార్యద ర్శులు మయూక్ బిస్వాస్, విపి సాను ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఎస్ఎఫ్ఐ చేస్తున్న కషికి తోడుగా విద్యార్థులు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి, రాష్ట్ర ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షుడు మాణిక్యం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రోళ్ల మహేష్, నల్లబెల్లి రమేష్ సహాయ కార్యదర్శి రజినీకంత్, రవి, సాయి, రజినీకాంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించలేని కేసీఆర్‌ను గద్దెదించాలి

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**

**నవ తెలంగాణ - సిద్దిపేట**



రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన విద్యారంగ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రానున్న ఎన్నికల్లో విద్యారంగ హామీలను అమలు చేయలేని కేసీఆర్ ప్రభుత్వాన్ని విద్యార్థి లోకం గద్దె దింపాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎడ్ల గురువరెడ్డి భవన్ లో విలేకరులతో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తూ,రోజు రోజుకు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తుందని, గత 9 సంవత్సరాలుగా విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని అన్నారు. సిద్దిపేట జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. గత 3 సంవత్సరాలుగా పెండింగులో ఉన్న 5,350 కోట్ల రూపాయల ఉపకార వేతనాలను విడుదల చేయక పోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్ని కళాశాలల యాజమాన్యాలు అప్పుల బాధతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ విద్యారంగం రోజు రోజుకు కుంటుపడిపోతున్నదని, అద్దె భవనాల్లో ఉంటున్న, శిథిలావస్థకు చేరిన సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని కోరారు. ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి సొంత జిల్లా అయిన సిద్దిపేట జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ని నెలకొల్పడం లో నిర్లక్ష్యం వహించడం ఏంటని ఆయన ప్రశ్నించారు. విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ఎన్నికల్లో కచ్చితంగా ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐ ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్, రాష్ట్ర నాయకులు నునవత్ శ్రీనివాస్, ఆకారపు శ్రావణ్, బాణోత్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ

**నవతెలంగాణ- సిద్దిపేటరూరల్**



ఉత్తమ సాగు పద్ధతులపై రైతులకు తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో బుస్సాపూర్, తోర్నాల, ఇర్కోడ్, గ్రామ రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మధ్య తెలంగాణ మండల, వ్యవసాయ పరిశోధన సహసంచాలకులు డా. ఆర్.ఉమారెడ్డి హాజరై మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, విత్తనోత్పత్తి, పచ్చిరొట్ట ఎరువు, అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి సాగు, డ్రోన్‌తో పిచికారీ, ఆధునిక సేద్యంలో వివిధ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రధాన శాస్త్రవేత్త డా. ఎస్. శ్రీదేవి, జె. విజయ్, కో ఆర్డినేటర్, సాయినాథ్, సరిత, పల్లవి, ఉమరాణి , శ్వేత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల ఆకస్మిక తనిఖీ

**నవతెలంగాణ-కోహెడ**



మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆరెపల్లి, చంద్రనాయక్‌తండా, మైసంపల్లి, శ్రీరాములపల్లి, పరివేద, నకిరెకొమ్ముల, కూరెళ్ళ, చెంచల్‌చెర్వుపల్లి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాధికారి ఈ.శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలలోని విద్యార్థుల హాజరు శాతాన్ని, పలు రికార్డులను, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ఆయనను పలువురు ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఫర్నిచర్ అందజేత

**నవ తెలంగాణ రాయపోల్**



ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన చేస్తే విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దావచ్చని మంతూర్ సర్పంచ్ వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం రాయపోల్ మండలం మంతూర్ ప్రాథమిక పాఠశాలకు శ్రీ సత్యసాయి సేవా సమితి హైదరాబాద్ వారి సహకారంతో ఫర్నిచర్ అందజేశారు. శ్రీ సత్య సాయి సేవా సమితి బేగంపేట్, హైదరాబాద్ సమితి సభ్యులు కెవిఎస్ సాయికుమార్, విక్రమ్ మెహతా ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపోల్ జి.తులసీదాస్ సహకారంతో మంతూర్ ప్రాథమిక పాఠశాలకు సుమారు 75 వేల రూపాయల విలువచేసే 30 ఐరన్ టేబుల్స్‌ను ఇప్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

**నవతెలంగాణ చేర్యాల**



మండలంలోని చిట్యాల గ్రామంలో సర్పంచ్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు గ్రామ పంచాయతీ, గ్రంథాలయ భవనాల నిర్మాణం కోసం రూ.20 లక్షల విలవ గల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. దానిలో రూ.34 లక్షల వ్యయంతో నిర్మించే భవనాల నిర్మాణ పనులకు బుధవారం సర్పంచ్ రామ్మోహన్‌రావు శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ మిట్టపల్లి సులోచన,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షులు కట్కూరు శ్రీరాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బొడుగం మహిపాల్ రెడ్డి, రైతు అధ్యక్షులు రాజు, కార్యకర్తలు కట్కూరు మల్లేశం పంజాల రాజు, గంగరబోయిన సిద్ధులు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, కారోబార్ మహేశ్వరి పాల్గొన్నారు.

## ఇసుక లారీని ఢీ కొట్టిన మరో లారీ

**ఇద్దరు కూలీల మృతి**

**నవ తెలంగాణ కొండపాక**



ఆగి ఉన్న ఇసుక లారీని వడ్ల పొట్టు లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో బీహార్‌కు చెందిన ఇద్దరు కూలీలు మృతి చెందిన సంఘటన కొండపాక మండలం మండలం లకుడారం శివారులో రాజీవ్ రహదారిపై బుధవారం జరిగింది. హైదరాబాద్ వైపు వెళ్తున్న ఇసుక లారీ మెకానిక్ ప్రాబ్లంతో లకుడారం శివారులో రోడ్డు పక్కకు నిలిపారు. అదే వైపు వెళ్తున్న వడ్ల పొట్టు లోడు లారీ నిలిచి ఉన్న ఇసుక లారీని ఢీ కొట్టింది. వరి పొట్టు లోడు లారీలో గల బీహార్‌కు చెందిన ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. రెండు లారీల డ్రైవర్లు పరారీలో ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

## పారిశుధ్య కార్మికురాలి కొడుకు ఆర్మీకి ఎంపికపై హర్షం

**నవ తెలంగాణ - దౌల్తాబాద్**



నిరుపేద దళిత సామాజిక వర్గానికి చెందిన పారిశుధ్య కార్మికురాలి కొడుకు దేశ సేవ చేయడానికి ఆర్మీకి ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్ అన్నారు. దౌల్తాబాద్ మండలం కోనాయపల్లి గ్రామంలో ఆర్మీకి ఎంపికైన గవ్వల పల్లి రమేష్, వారి తల్లిని ఎస్ఆర్ ఫౌండేషన్ తరపున బుధవారం సన్మానించి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పుట్ట రాజు, కోశాధికారి మహమ్మద్ ఉమర్, గ్రామ యువకులు శ్రీనివాస్,స్వామి, కనకరాజు, మహేష్, అశోక్, ప్రవీణ్, రవి, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ వసంత్ సహకారం కోరిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-జహీరాబాద్**

అధిష్టానం ఆశీర్వదించి టిక్కెట్‌ను కేటాయించిందని.. తనకు మద్దతు ప్రకటించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఢిల్లీ వసంత్‌కు విజ్ఞప్తి చేశారు. అందుకు ఢిల్లీ వసంత్ సున్నితంగా తిరస్కరించారు. దళితబంధులో తమ సామాజిక వర్గానికి తీరనీ అన్యాయం జరిగిందని ఢిల్లీ వసంత్ అన్నారు. అలాగే ఈ సీజన్ చెరకు క్రషింగ్ మరమత్తులు ఇప్పటికీ మొదలు పెట్టలేదని, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా చెరుకు రైతుల పైన ఇంత నిర్లక్ష్యం ఎందుకని, ఇది పూర్తిగా మీ నిర్లక్ష్యమే అంటూ ఎమ్మెల్యేను నిలదీశారు. స్థానిక సంస్థల్లో 'మాల' సామాజిక వర్గానికి మీరు ఏం చేసారని మానిక్ రావును ప్రశ్నించారు. స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై నిలదీశారు. జహీరాబాద్ నియోజకవర్గ అభివద్ధికై చివరి వరకు పోరాడుతామన్నారు. ఢిల్లీ వసంత్ బందం సభ్యులు యల్.జనార్ధన్, బిల్లిపురం మాధవ్ రెడ్డి, అశోక్ పాటిల్, స్టీవెన్, తదితరులు ఉన్నారు.

## ఖబర్దార్ మైనంపల్లి హనుమంతరావు

**నవ తెలంగాణ- గజ్వేల్**



మల్కాజిగిరి ఎమ్మెల్యే హనుమంతరావు పరిధి దాటి మాట్లాడుతున్నారని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ గజ్వేల్ నియోజకవర్గ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చిప్పల యాదగిరి అన్నారు. రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, తన్నీరు హరీష్ రావు ని అహంకార పదజాలంతో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఎవరికి టిక్కెట్ ఇయాలో ముఖ్యమంత్రి తెలుసు.. నువ్వు చెబితే టికెట్ ఇవ్వరన్నారు. పార్టీకి ఎవరు అవసరమో ఉద్యమ యోధుడికి తెలుసన్నారు. డిఆర్టియు నాయకులు నేరేడు భూపతి, రాజేందర్, నర్సింగరావు, పెరిక లక్ష్మణ్, బాల్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం



**నవతెలంగాణ-జహీరాబాద్**

ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఓ వరం లాంటిదని రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీద్ అన్నారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన సమ్రిన్ బేగం గత కొన్ని రోజులు గా అనారోగ్యంతో బాధపడుతూ.. చికిత్స కోసం నిమ్స్ హాస్పట ల్‌లో చేరారు. అయితే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం కోసం ఎంపీ బిబి పాటిల్‌ను సంప్రదించగా.. వెంటనే స్పందించి రూ.2,50,000 ఎల్వోసీని మంజూరు చేయించారు. కాగా ఎంపీ బీబీ పాటిల్ ఆదేశాల మేరకు రైల్వేబోర్డు మెంబర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ ఫరీద్ సంబంధిత ఎల్వోసీ పత్రాన్ని సమ్రిన్ బేగం కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సమ్రీన్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంపీ బీబీ పాటిల్ షేక్ పరిధిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఎఫ్ఐ పోరాటాలు ఆదర్శనీయం




**నవతెలంగాణ-జహీరాబాద్**

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ చేస్తున్న సమరశీల పోరాటాలు ఆదర్శనీయమని డీఎస్పీ వీ.రఘు అన్నారు. సెప్టెంబర్ 8 నుంచి10 వరకు సంగారెడ్డిలో జరిగే ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించి డీఎస్పీ మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ అనునిత్యం పోరాడుతున్నదని.. ఈ నేపథ్యంలో ప్లీనరీ సమావేశాలు సంగారెడ్డిలో పెట్టడం మంచి పరిణామమన్నారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ.. ఈ ప్లీనరీ సమావేశాల్లో గత కార్యక్రమాలు చర్చించి విద్యార్థులు విద్యా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నరు. కాబట్టి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రవర్ధన్, అతిక్ వంశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ శ్రీహరి, ఐసి మోహన్‌ను కలిసిన చింతా ప్రభాకర్

**నవతెలంగాణ-సంగారెడ్డి**

సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు టిక్కెట్ ప్రకటించడంతో.. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. శ్రీహరి, గంగ నర్సరీ ఐసి మోహన్ నివాసాలకు బుధవారం చింతా ప్రభాకర్ వెళ్లి వారి కుటుంబసభ్యులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కంది జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి ,మం.పార్టీ అధ్యక్షులు చక్రపాణి, ఎంపీటీసీ నాగరాజ్ గౌడ్, సీడీసీ మాజీ చైర్మెన్ విజేందర్ రెడ్డి, జీవి శ్రీనివాస్, లాడే మల్లేశం, విఠల్, గోవిద్ తదితరులు పాల్గొన్నారు.



## సీపీఐ(ఎం) నాయకులు వాజిద్ అలీకి పితృవియోగం

**నవతెలంగాణ-పటాన్‌చెరు**

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వాజిద్ అలీకి పితృ యోగం కలిగింది. పటాన్‌చెరు పట్టణానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అక్బన్ వాజిద్ అలీ తండ్రి అల్‌హజ్ అక్బన్ మహమూద్ అలీ(94) కొంతకాలంగా అనారోగ్యంతో భాదపడుతున్నాడు. కాగా బుధవారం సాయంత్రం స్వగృహంలో తుది శ్వాస విడిచాడు. కుటుంబంలో పెద్దదిక్కైనా తండ్రి మరణంతో వాజిద్ అలీ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య, చుక్కా రాములు, జిల్లా కార్యదర్శి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం, నరసింహారెడ్డి, జిల్లా నాయకులు నాగేశ్వర రావు, పాండురంగారెడ్డి తదితరులు భౌతికాయాన్ని సందర్శించి ఘన నివాళ లర్పించారు.వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లేట్ల పంపిణీ

**నవతెలంగాణ-సంగారెడ్డి**

లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు లయన్ పెద్దోటి శ్రీనివాస్ గౌడ్ దాతృత్వంతో(డోనర్) వారి మనుమడు అద్విక్ గౌడ్ జన్మదిన సందర్భంగా 111 స్టీల్ ప్లేట్‌లను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా లయన్ డిస్ట్రిక్ట్ చైర్మన్ పి.రాములు గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు అన్నారు. చక్కని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యస్. విజయేందర్ రెడ్డి, దాత పి.శ్రీనివాస్ గౌడ్, వారి కుటుంబ సభ్యులతో పాటు అధ్యక్షులు జే.ప్రభాకర్, కార్యదర్శి యల్.మల్లేశం డైరెక్టర్లు డి.హన్మంత్ గౌడ్,పి.రాంగోపాల్, సభ్యులు భరతయ్య, బి.శ్రీనివాస్, పాఠశాల నాగార్జునరెడ్డి, ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రణాళికాబద్ధంగా వార్డుల్లో అభివృద్ధి పనులు

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

ప్రణాళికాబద్ధంగా వార్డుల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు బొల్లారం మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు బాలాజీనగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులకు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ రోజా బాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మున్సిపాల్టీల అభివృద్ధికి కేటా యించిన ఎస్డీఎఫ్ నిధులతో ప్రణాళికబద్ధంగా మౌలిక వస తులను ఏర్పాటు చేస్తున్నామని.. ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో, వార్డు కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత గుండ్ల మహేందర్ రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఏఈ శ్రీకాంత్, మునిస్పల్ సిబ్బంది కాలనీ వాసులు పాల్గొన్నారు.



## చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గుమ్మడిదలకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్ బహిరంగ సభకు వెళ్తున్న సందర్భంగా గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద సీఎం కేసీఆర్‌కి పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికేందుకు 300 మంది కార్యకర్తలతో కలిసి బొల్లారం మున్సిపాల్టీ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి బయలుదేరి వెళ్లారు. 30 కార్లు, 10 ఆటోలు కాన్వాయ్‌గా వెళ్లాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రయ్య, స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజు(మాజీ ఎంపీటీసీ), పరుశురాం, భాస్కర్(మాజీ వార్డ్ మెంబర్), నర్సింహా రాజు, దిననాథ్, వెంకటయ్య, నరేందర్, సంజీవ్, సత్యనారాయణ, సురేష్, వెంకట్, రవితేజ, జెక్కి, చిన్నా మధు, శైలేష్, ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు తరలి వెళ్లిన నాయకులు

**నవతెలంగాణ-న్యాల్‌కల్**



మెదక్ పట్టణంలో బుధవారం జరిగిన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రవీందర్ ఆధ్వర్యంలో న్యాల్‌కల్ మండలం నుంచి తరలి వెళ్లారు. వారిలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ హద్నూర్ సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్, నాయకులు సర్పంచులు మారుతి, నిరంజన్ రెడ్డి, మహిపాల్, రాజుపటేల్, షకీల్,వినోద్, రాజు, వసీంతదితరులు పాల్గొన్నారు.

# పూల వర్షంతో సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ కళాకారుల నృత్యాలు, బోనాలు, పీర్లతో స్వాగతం
- మహిపాల్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలి : ముఖ్యమంత్రి కేసీఆర్

**నవతెలంగాణ-గుమ్మడిదల**





సీఎం కేసీఆర్ మెదక్ సభకు గుమ్మడిదల మండలం ప్రారంభం గ్రామమైన అన్నారం నుంచి దోమడుగు, బొంతపల్లి, గుమ్మడిదల, మంబాపూర్ ప్రధాన రహదారి గుండా వెళ్తున్నారనే సమాచారంతో.. ఎమ్మెల్యేగూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పూల వర్షంతో స్వాగతం పలికారు. గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద పది నిమిషాల పాటు సీఎం కేసీఆర్ అనుమతితో వివిధ కళాకారులతో.. తెలంగాణ సాంప్రదా యమైన అమ్మవారి బోనాలు, మైనార్టీలు పీర్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంత ఘనంగా స్వాగతం పలికినందుకు ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. పటాన్చెరువు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి మైపాల్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. గుమ్మడిదల మండలానికి కాళేశ్వరం నీరు వ్యవసాయ సాగు కొరకు విడుదల చేయనున్నామని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ కుర్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటిసి కుమార్ గౌడ్, వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, ఎంపీటీసీలు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, చిదు పద్మ కొండల్ రెడ్డి, భుద్దుల పార్వతమ్మ, బి లక్ష్మి, సర్పంచులు నరసింహారెడ్డి, రాజశేఖర్, ఆలేటి నవీన శ్రీనివాస్‌రెడ్డి, మమతా వేణు, శ్రీనివాస్, దోమడుగు శంకర్, ఆంజనేయులు, హనుమంత్‌రెడ్డి, దీపనరేందర్‌రెడ్డి, సుంచు రేణుక స్వామి, శ్యామల దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దామోదర రాజనర్సింహకు సన్మానం

**నవతెలంగాణ-జోగిపేట**

ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శాశ్వత ఆహ్వానితులుగా ఎన్నికైన మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహను అందోల్ మండలం ఎర్రారం మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, సంగుపేట మాజీ సర్పంచ్ శివశంకర్ గౌడ్‌లు బుధవారం సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్న దామోదర రాజనర్సింహకు ఈ పదవి రావడం పట్ల వారు శాలువా, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



## ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌కు సన్మానం

**నవతెలంగాణ-జోగిపేట**

అందోల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండోసారి చంటి క్రాంతి కిరణ్ పేరు ఖరారు కావడంతో బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మార్కెట్ డైరెక్టర్ ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువా ఘజమాలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేకు స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, మహేష్, గోపాల్, లక్ష్మణ్, పోచయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# రికార్డుల నిర్వహణపై నిర్లక్ష్యమెందుకు?

- ఎఫ్ఏ, టీఏ, ఏపీఓలపై అడిషనల్ పీడీ మండిపాటు

**నవతెలంగాణ-వట్‌పల్లి**



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీల హాజరు రిజిస్టర్, మాస్టర్లను, నివేదికలను, రికార్డులను నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించడంపై ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓపై అడిషనల్ పిడి జయదేవ్ ఆర్య మండిపడ్డారు. ఎంపీడీవో జగదీశ్వర్ అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్‌లో జాతీయ ఉపాధి హామీపై రెండో విడత సామాజిక తనిఖీలు పురస్కరించుకొని బుధవారం ప్రజా దర్బార్ నిర్వహిం చారు. మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో 01.11.21. నుంచి 31.03.23. వరకు జాతీయ ఉపాధి హామీలో రూ.4 కోట్ల 60 లక్షల 54 వేల 900 పై చేలుకు పనులు చేపట్టి కూలీ డబ్బులను అందజేసినట్లు రికార్డులలో నమోదు చేశారని జయదేవ్ ఆర్య అన్నారు. అయితే రికార్డులలో నమోదు చేసిన దానికి భిన్నంగా కొన్ని గ్రామాల్లో డబ్బులు పంపిణీ చేసినా.. మాస్టర్లు నమోదు చేయకపోవడం, మరికొన్ని గ్రామాలలో కూలీలు పనులు చేపట్టినప్పటికీ మాస్టారులో సంతకాలు తీసుకోకపోవడం, సంతకాలు తీసుకోకుండానే డబ్బులు చెల్లించడం కోసం పే స్లిప్పులను అందజేయడం, కూలీలు చేసిన దానికంటే కొందరికి ఎక్కువ చెల్లించడం, కొంతమంది కూలీలు పని చేసినప్పటికీ వారికి డబ్బులు అందకపోవడం లాంటి తప్పిదాలతో రికార్డులు అస్తవ్యస్తంగా ఉండడంపై మండిపడ్డారు. విధి నిర్వహణలో చాలా మార్పులు చేసుకోవాల్సి ఉన్నదని.. వారి వైఖరిలో మార్పు రాకపోతే తదుపరి చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. ఎనిమిది గ్రామాలకు సంబంధించి రికార్డుల నిర్వహణ పూర్తి అధ్వానంగా ఉన్న కార్యదర్శుల నుంచి రూ. 14 వేల 19 రూపాయలను ఈనెల 26 కల్లా రికవరీ చేయాలని.. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. గ్రామపంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శుల పనితీరు 85శాతం ఉంటేనే ఉద్యోగ క్రమబద్ధీకరణకు అవకాశం ఉన్నదన్నారు. సర్పంచులు, ఎంపీపీ, ఎంపీటీసీలు మెదక్‌లో జరిగే సీఎం భారీ బహిరంగ సభకు తరలి వెళ్లడంతో.. గ్రామాలలో చేపట్టిన పనులకు, తయారు చేసిన నివేదికలకు పొంతన లేకపోవడంతో ప్రశ్నించే వారు కరువై అధికారులకు తలనొప్పి తప్పినట్టయింది. త్వరలో ప్రారంభం కానున్న హరితహారాన్ని ప్రతి గ్రామపంచాయతీ 750 మొక్కలు నాటాలని అడిషనల్ పీడీ అన్నారు. సర్పంచులను. ఎంపీటసీలను, ఎంపీపీ, జెడ్పీటీసీ, సొసైటీ చైర్మెన్‌లను భాగస్వాములను చేసి కలుపుకొని పోవాలన్నారు. మండలానికి ఒకటి చొప్పున సంపద వనాలు ఏర్పాటు చేసుకొని ఒక ఎకరా విస్తీర్ణంలో చెట్లు నాటేందుకు కార్యక్రమాన్ని రూపొందించుకోవాలన్నారు. ఈ ఏపీడి వామన్ రావు. క్వాలిటీ కంట్రోలర్లు భోజిరెడ్డి, అమర్నాథ్, విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ఎంపీడీవో జగదీశ్వర్, ఎంపీఓ యూసుబ్, ఏపీవో శ్యామ్, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన వేతనాన్ని కార్మికులందరికీ వర్తింపజేయాలి

- మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలి
- సమస్యల పరిష్కారానికి నేటినుండి విధుల బహిష్కరణ
- సీఐటీయూ సహాయ కార్యదర్శి యాదగిరి

**నవతెలంగాణ-సంగారెడ్డి**




మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులందరికీ పెరిగిన వేతనం వర్తింపజేయాలని.. మున్సిపల్ కార్మికుల పై అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నేటి నుంచి సమ్మె చేస్తున్నామన్నారు. మున్సిపల్ కార్మికుల సమావేశాన్ని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. సంగారెడ్డి మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికులందరికీ పెరిగిన వేతనం వర్తింపజేయాలన్నారు. కార్మికులపై మున్సిపల్ అధికారుల వేధింపులా ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇబ్బంది పెడుతున్న మున్సిపల్ అధికారుల పైన చర్య తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యల పైన ఆగస్టు 8న మున్సిపల్ కమిషనర్‌కి సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. కానీ ఇప్పటివరకు మున్సిపల్ యూనియన్‌తో చర్చలు జరపకపోవడం చాలా దారుణమ న్నారు. చర్చలకు పిలువకపోవడంతో సమ్మెకు దిగాల్సి వస్తున్నదన్నారు. కార్మికులకు ఏమైనా జరిగితే మున్సిపల్ అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఉదయం 3 గంటల నుంచి కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తు న్నార న్నారు. కానీ వాళ్ల సమస్యలు మాత్రం వినకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, 11వ పిఆర్సి చైర్మెన్ సిఫారసు చేసిన వేతనాలు రూ.19000, రూ.22,900, రూ.31,040లను కనీస వేతనాలుగా నిర్ణయించి ఇవ్వాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, కార్మికులందరికి డబుల్ బెడురూం ఇండ్లు కేటాయింపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు వేణు, శ్రీశైలం, వినోద్ కుమార్, సువర్ణ, మల్లేశం, వీరేశం, శ్రీనివాస్, రాజు, మల్లేష్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం




**నవతెలంగాణ-జహీరాబాద్**

జహీరాబాద్ మున్సిపాల్టీలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూరిగా విఫలమవుతు న్నారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆరో రోజైన బుధవారం నిరసన చేపట్టి.. మహిపాల్ మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వారాంతపు సెలవులు, ఈఎస్ఐ పీఎఫ్, యూనిఫామ్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన బీఆర్ఎస్.. ఎన్నికల అనంతరం మర్చిపోవడం సరికాదన్నారు. తెలంగాణలో కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండదన్న సీఎం కేసీఆర్.. కాంట్రాక్టు వ్యవస్థలో ఉన్న మున్సిపల్ కార్మికులను ఎందుకు పర్మినెంట్ చేయడం లేదన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు రావాల్సిన రూ.21 వేల వేతనాన్ని అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన చేస్తామని, విధులు బహిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కామయ్య, యశోదమ్మ, చంటి శేఖర్, తుకారం, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాల పోస్టల్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-సంగారెడ్డి**




సంగారెడ్డి జిల్లాలో సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు జరిగే ఎస్ఎఫ్ఐ తెలంగాణ ప్లీనరి సమావేశాలను జయప్రదం చేయాలని సెయింట్ ఆంతోని డిగ్రీ కళాశాల వద్ద ఆహ్వాన సంఘం చైర్మెన్, సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల చైర్మెన్ సాలోమన్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాలోమన్ రెడ్డి మాట్లాడు తూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుండడం అభినందనీయమన్నారు. సంగారెడ్డిలో మూడ్రోజుల పాటు జరగనున్న ప్లీనరీ సమావేశాల్లో.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కాబట్టి విద్యార్థులు, విద్యావంతులు, మేధావులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటకొండ రవి మాట్లాడుతూ.. ఈ సమావేశాల్లో గత కార్యక్రమాలు చర్చించడానికి, విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడం కోసం ఈ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలన్నారు.ప్రభుత్వ విద్యా సంస్థలో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు మహేష్, రమేష్, రజినీకాంత్, రవి, శ్రీకాంత్ ఉన్నారు.

## ప్రజలను మభ్యపెట్టి.. అధికారం కోసం ఆరాటం



**నవతెలంగాణ-పటాన్‌చెరు**

ప్రజలను మభ్యపెట్టి అధికారం కోసం మరోసారి కేసీఆర్ తహ తహ లాడుతున్నాడని బీజేపీ జిల్లా అధ్యక్షులు నరేందర్ రెడ్డి, పటాన్ చెరు మాజీ జెడ్పిటిసి, ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్‌లు ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత తొమ్మిదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం చేస్తూ బీసీబంధు, దళితబంధు, డబల్ బెడ్రూం ఇల్లు అంటూ అబద్ధపు ప్రచారాలు చేసి ప్రజలను మభ్యపెట్టి మరొకసారి అధికారం కోసం ఆరాట పడుతున్న కెసిఆర్ ప్రభుత్వాన్ని గద్దే దించేవరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఇప్పటికైనా టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తమ ఓటు తో ప్రభుత్వాన్ని గద్దె దించి మీకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, భారతి నగర్ డివిజన్ అధ్యక్షులు మన్నె శ్రీకాంత్, పటాన్‌చెరు పట్టన అధ్యక్షులు నాగరాజ్ యాదవ్, జిన్నారం మండల అధ్యక్షులు బండి శ్రీకాంత్, బొల్లారం మున్సిపల్ అధ్యక్షులు అనంద్ కృష్ణ నాయక్.ప్ నాయకులు,రాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు సాయి కిరణ్ రెడ్డి,శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**



శ్రీకాకుళానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి బతుకుదెరువు కోసం బొల్లారం మున్సిపాల్టీ వినాయకనగర్‌కు వచ్చి.. ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. అయితే అతనికి అపెండెక్స్ నొప్పి రాగా ఆపరేషన్‌కు రూ.40వేలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెల్సుకున్న బీజేపీ బొల్లారం అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి బుధవారం బాధితుడిని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు సాయం చేశారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు ఆనంద్ కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## నీలం వర్గీయుల ముందస్తు అరెస్టు

**నవతెలంగాణ-గుమ్మడిదల**



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ యువసేన(ఎన్ఎమ్ఆర్) సభ్యులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎమ్ఆర్ మండల యువసేన నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ముదిరాజులను గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పటాన్చె రువు నియోజకవర్గ టికెట్టు విషయంలో పునర్ ఆలోచన చేయాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జింక గోపాల్, తుజాల్పూర్ వీరేష్, బిక్షపతి రెడ్డి, తలారి రాజు, వీరేష్, సుమారు 20 మంది కార్యకర్తలు పాల్గొన్నారు

# పటాన్‌చెరు టికెట్‌పై కేసీఆర్ పునరాలోచించాలి

- బహుజన బిడ్డ నీలం మధు ముదిరాజ్‌కు టికెట్ కేటాయించాలి
- ఇస్నాపూర్‌లో బహుజన వర్గాల ర్యాలీ, జాతీయ రహదారిపై రాస్తారోకో, బైఠాయింపు

**నవతెలంగాణ-పటాన్‌చెరు**




పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్‌పై కేసీఆర్ పునరాలోచించాలని రాష్ట్ర మన రజక సంఘం ప్రధాన కార్య దర్శి చాకలి వెంకటేష్, చాకలి సంజీవ్, యాదయ్య, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ గారెల శ్రీను ముదిరాజ్ డిమాండ్ చేశారు. బీసీ వర్గాల నేత నీలం మధు ముదిరాజ్‌కు పటాన్ చెరు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరుతూ.. పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ నుండి చౌరస్తా వరకు సబ్బండ వర్గాల నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులతో పాటు బహుజన నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీసీల ఐక్యత వర్ధిల్లాలి, సబ్బండ వర్గాల నాయకులకి న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం పేరుతో పాలన కొనసాగిస్తున్నానని చెప్తున్న కేసీఆర్ బీసీ వర్గాల నాయకులకు టికెట్ కేటాయింపులో చిన్న చూపు చూడడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. బీసీలను కేవలం ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకు గా వాడుకుంటూ బహుజన వర్గాల నాయకులని తొక్కి పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీసీ కులాలైన ముదిరాజ్‌లు, నాయిని బ్రాహ్మ, రజక ఇతర బీసీ కులాల వారికి సీట్లు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. గత నాలుగేండ్లుగా నిరంతరం ప్రజలందరికీ అండగా ఉంటూ బీఆర్ఎస్ పార్టీని విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లిన నీలం మధుకు టికెట్ కేటాయించకపోవడం సరికాదన్నారు. 60 లక్షల ఓట్లు ఉన్న ముదిరాజ్ సామాజికవర్గానికి ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం భావ్యం కాదన్నారు. 10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 58 సీట్లు ఇస్తే, బీసీ వర్గానికి ఎన్ని సీట్లు ఇవ్వాలో మీరే ఆలోచించుకోవాలని హితవు పలికారు. వెంటనే బీఆర్ఎస్ అధిష్టానం పటాన్ చెరు టికెట్ పై పునరాలోచన చేసి బహుజన బిడ్డ నీలం మధు ముదిరాజ్ కు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీలంతా ఏకమై మా సత్తా చూపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మన రజక సంఘం ప్రధాన కార్యదర్శి చాకలి వెంకటేష్, చాకలి సంజీవ్, యాదయ్యమత్స్యశాఖ జిల్లా డైరెక్టర్శ్రీను ముదిరాజ్,లక్ష్మారెడ్డి, దానయ్య, వడ్డెర వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, గౌరిచారి, అనిల్, మురళి యాదవ్,సబ్బండ వర్గాల నాయకులు, మద్దతుదారులు పాల్గొన్నారు..



## మోకాళ్లపై నిలబడి ఏఎన్ఎంల నిరసన

**నవతెలంగాణ-సంగారెడ్డి**

రాష్ట్ర వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు చేస్తున్న నిరవధిక సమ్మె 8వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా బుధవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ మాట్లాడుతూ.. ఏఎన్ఎంలతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి.. వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. గత 15, 16 ఏండ్లుగా ప్రభుత్వం ఏఎన్ఎంలతో వెట్టిచాకిరి చేయిస్తున్నదని మండిపడ్డారు. వారిని రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదన్నారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సమ్మెకు మద్దతు తెలిపాలని కోరారు. కార్యక్రమంలో ప్రవీణ, ఉమా, రాధా, మీనా, సత్యవతి, కవిత తదితరులు పాల్గొన్నారు.



## గజమాలతో ఘన స్వాగతం

**కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిన అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**



**నవ తెలంగాణ-టేక్మాల్ :** ఎన్నికల శంఖారావాన్ని పూరించినట్లుగా టేక్మాల్ పట్టణంలో గులాబీ కార్యకర్తలతో గుబాలించిపోయింది. మండల నలు మూలల నుంచి గులాబీ కార్యకర్తలు టేక్మాల్ చౌరస్తా వద్దకు వచ్చి ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు ఘన స్వాగతం పలుకుతూ గజమాలతో సన్మానం చేశారు. రెండవసారి టిక్కెట్ రావడంతో ఆనందాన్ని తట్టుకోలేక కార్యకర్తలు తమ అభిమానాన్ని కటౌట్‌ల ద్వారా కేరింతలతో బాణాసంచాతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలందరి గుండెల్లో నిలిచిపోతున్నాయని రెండవసారి తనకు ఎమ్మెల్యే టికెట్‌పై సంతోషంగా ఉందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అధిక మెజార్టీతో గెలిపించి గుండెల్లో పెట్టుకున్నందుకు మీ రుణం తీర్చుకునే అవకాశం మరోసారి వచ్చిందన్నారు. మీ ఉత్సాహాన్ని ఇలాగే ఉంచుకొని ఎన్నికల వేళ ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దయ్య, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, శేఖర్ రెడ్డి, సుప్రజ, వరలక్ష్మి, చింత స్వప్న రవి, పులి మల్లేశం భాస్కర్ ఆకుల సంగయ్యలు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో



**నవతెలంగాణ-నర్సాపూర్**

మెదక్ బహిరంగ సభకు నర్సాపూర్ మీదుగా వెళుతున్న సందర్భంగా సీఎంను అడ్డుకునేందుకు బుధవారం నర్సాపూర్ బస్టాండ్ ఎదురుగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి సీఎం గో బ్యాక్, సీఎం కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు హుటా హుటిన రంగ ప్రవేశం చేసి ధర్నా చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని డీసీఎం వ్యాన్‌లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌కు తరలించిన వారిలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సందీప్, దాడిగా నరేష్, ఆంజనేయులు, భాస్కర్, ఇస్మాయిల్, శ్రీకాంత్, రిజ్వాన్ , చారిలు తదితరులు ఉన్నారు.

## అడ్డుకుంటామనే భయంతోనే ముందస్తు అరెస్టులు



**నవతెలంగాణ-వెల్దుర్తి**

ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు మెదక్ జిల్లా పర్యటన సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డుకుంటారనే భయంతోనే ముందస్తుగా కొందరినీ హౌస్ అరెస్టు మరికొందరిని రోడ్డుపై అరెస్టు చేసి వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు సీఎం కేసీఆర్ మెదక్ జిల్లాకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని వారన్నారు. మెదక్ జిల్లాలో ఉన్న కార్యాలయాలను సిద్దిపేటకు తరలించారన్నారు. అభివృద్ధి నిధుల కోసం ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018 ఎన్నికల్లో గెలుపొంది నర్సాపూర్ నియోజకవర్గం అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చి వాటిని నెరవేర్చక మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్, దళితులకు మూడెకరాల భూమి ఏకకాలంలో రుణమాఫీ ఇంటికో ఉద్యోగం అన్నారని వీటిని నెరవేర్చకుండానే కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేయడమే తప్ప ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అక్రమంగా అరెస్టు చేస్తే భయపడేది లేదన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. నర్సాపూర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం జరుగుతుందని ఆవుల రాజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## కల సహకారం.. రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు

- రెండు రోజుల్లో జీవో జారీకి సీఎం హామీ
- పట్టణ అభివృద్ధికి రూ.25 కోట్లు, డిగ్రీ కళాశాల ప్రకటన
- రామాయంపేటకు కేసీఆర్ వరాల జల్లు

**నవతెలంగాణ-రామాయంపేట**

ఎన్నో ఏళ్లుగా రామాయంపేట ప్రజల ఆకాంక్ష అయిన రామాయంపేట రెవెన్యూ డివిజన్ కల సహకారమైంది. బుధవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఎస్పి కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రెండు రోజుల్లో అందుకు అనుగుణంగా జీవో జారీ చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో పాటు రామాయంపేటకు కేసీఆర్ వరాలజల్లు కురిపించారు. రామాయంపేటకు డిగ్రీ కళాశాల మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే పట్టణంలో మౌలిక వసతులకు, అభివృద్ధి పనుల కోసం రూ.25 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సూచనల మేరకు పట్టణ అభివృద్ధికి ఏ సహాయానికైనా సిద్ధమని ఆయన తెలిపారు.

**రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు పట్ల హర్షం**



రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు గజవాడ నాగరాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ సరాఫ్ యాదగిరితోపాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు. రామాయంపేట రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నర్సాపూర్‌లో సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం

**ఎమ్మెల్యే మదన్ రెడ్డి ,రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ సునీత రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులు**

**నవతెలంగాణ-నర్సాపూర్**

ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్ బహిరంగ సభకు నర్సాపూర్ పట్టణం మీదుగా వెళ్తున్న సందర్భంగా నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ సునీతా రెడ్డిలతోపాటు బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ కాన్వాయ్ నర్సాపూర్ చౌరస్తాలోకి రాగానే పెద్ద ఎత్తున కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ పూల వర్షం కురిపించారు . అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ కాన్వాయ్‌లో ఎమ్మెల్యే మదన్ రెడ్డిని, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ సునీత రెడ్డిలను బస్సులో ఎక్కించుకొని మెదక్ బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు.

**నర్సాపూర్ నాయకుల్లో నిరుత్సాహం.**

మెదక్‌లో జరిగే బహిరంగ సభకు వెళుతున్న సీఎం కేసీఆర్ నర్సాపూర్‌లో కొద్దిసేపు ఆగుతారని బీఆర్ఎస్ నాయకులు భావించారు. అయితే సీఎం కేసీఆర్ ఆగకపోవడంతో స్థానిక నాయకులు నిరుత్సాహపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ దేవేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్ర



గౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్ గౌడ్, లకావత్ రమేష్ నాయక్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నయీముద్దీన్, పిఎసిఎస్ ఛైర్మన్ రాజు యాదవ్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు పంబల బిక్షపతి, స్థానిక నాయకులు హబీబ్ ఖాన్ , జగదీశ్వర్, కుమ్మరి నాగేష్, కృప చారి , ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులకు బెదిరేది లేదు అదిరేది లేదు



**కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్ రెడ్డి**

**నవతెలంగాణ-పాపన్నపేట**

అక్రమ అరెస్టులకు అదిరేది లేదు బెదిరేది లేదని మెదక్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ నాయకులను. అక్రమంగా అరెస్టు చేసి లక్ష్మి నగర్ ప్రగతి సెంటర్లో ఉంచారు. కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని. ప్రశ్నించడం పాపమా ఇదెక్కడి ప్రజాస్వామ్యం అంటూ ఆయన ప్రశ్నించారు. గత ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రచారంలో భాగంగా మెదక్ నియోజకవర్గంపై హామీల జల్లు కురిపించారు తప్ప తూతూ మంత్రంగానే అమలు చేశారన్నారు. గత తొమ్మిది సంవత్సరాలు గడిచిన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పట్టించుకున్న పాపన పోలేదన్నారు. అధికారంలోకి రాగానే 100 రోజుల లోపల నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని, మెదక్‌కు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుతోపాటు మెదక్ పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దుతామనీ, ఘనపూర్ ఆయకట్టుతో పాటు ఏడుపాయల అభివృద్ధికి 100 కోట్ల చొప్పున 200 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఇప్పటికీ అతీగతీ లేదన్నారు. ఇవే కాకుండా పెద్ద ఎత్తున హామీలు కురిపించి నేటికి ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. గతంలో వచ్చిన హామీలను నెరవేర్చాలని సీఎం కేసీఆర్ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యక్రమం చేపడితే అర్ధరాత్రి దొంగల లాగా పోలీసులను పంపించి అక్రమంగా ఎత్తుకొచ్చిన ఘటనలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మెదక్, పాపన్నపేట్, కోల్చారం మండలాల అధ్యక్షులు శంకర్, గోవింద్ నాయక్, మల్లేష్ గౌడ్ , జిల్లా కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఏర్పుల విజయ్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల బాబులతో పాటు మెదక్, పాపన్నపేట్, కొల్చారం మండలాల నాయకులు కార్యకర్తలతో పాటు సీపీఎం, బీజేపీ, ఎంఆర్పిఎస్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు నాయకుల ముందస్తు అరెస్టులు



**నవ తెలంగాణ-నర్సాపూర్**

జిల్లా కేంద్రమైన మెదక్‌లో సీఎం కేసీఆర్ బుధవారం. బహిరంగ సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ ఇతర పార్టీల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మెదక్‌లో నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు కాంగ్రెస్, బీజేపీ నాయకులను బుధవారం తెల్లారి జామున పోలీసులు అఖిలపక్షం నాయకుల ఇండ్ల వద్దకు వెళ్లి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం వారిని విడిచిపెట్టారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళి యాదవ్, కాంగ్రెస్ టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్ గుప్తా ,రాజేందర్, మల్లేశం ఎద్దు రమేష్, అశోక్, సురేష్ నాయక్, రెడ్డిపల్లి అశోక్ గౌడ్ సంఘసాని సురేష్, ఆంజనేయులు గౌడ్, ప్రేమ్ కుమార్, శ్రీశైలం యాదవ్, ఉదయ్ తదితరులు ఉన్నారు.

**నవతెలంగాణ-నార్సింగి :** మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి పిలుపు మేరకు మెదక్‌లో జరగనున్న బహిరంగ సభను అడ్డుకునేందుకు బయలు దేరిన పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. నార్సింగి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులను పార్టీ సీనియర్ నాయకుడు మల్కయ్యతో సహా పలువురిని నార్సింగి పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు పట్టుబడకుండా మండల కేంద్రానికి చెందిన డీసీసీ నాయకుడు ఈరప్ప యాదగిరి యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్లు, గౌస్ పాషా, తదితరులు మెదక్‌లోని పాత కలెక్టరేట్ భవన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి వారు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి అధ్యక్షతన మెదక్ పాత కలెక్టరేట్ నుంచి ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా బయలుదేరారు. బయలుదేరిన నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సభను అడ్డుకునేందుకు కంఠారెడ్డి తిరుపతితో పాటు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పల్లె రాంచందర్ గౌడ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పిసిసి సభ్యుడు మామిండ్ల ఆంజనేయులు, డీసీసీ నాయకుడు ఈరప్ప యాదగిరి యాదవ్, నార్సింగి మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**నవ తెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్**

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్ బహిరంగ సభ సందర్భంగా కాన్వాయ్‌ని అడ్డుకుంటారనే సమాచారంతో మనోహరాబాద్ తూప్రాన్ మండలాల్లో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. బహిరంగ సభకు హైదరాబాద్ నుంచి మెదక్ రోడ్డు మార్గంలో వెళుండడంతో రెండు పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌తో కాన్వాయ్‌ని అడ్డుకోనున్నట్టు తెలిసింది. దాంతో బుధవారం తెల్లవారుజామునే నాలుగు గంటల ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏశం నాగరాజుతో పాటు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

**నవ తెలంగాణ-నిజాంపేట :** ముఖ్యమంత్రి మెదక్ పర్యటనలో భాగంగా నిజాంపేట మండల కాంగ్రెస్, బీజేపీ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ కమ్యూనిస్టు పార్టీ నాయకులకు నిజాంపేట పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు క్యాంపు కార్యాలయం ముట్టడికి బయలుదేరుతున్న తరుణంలో ప్రభుత్వం రాత్రి నుంచే అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. ఈ అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు ఈ పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగం గౌడ్ మాట్లాడుతూ నిజాంపేట మండల కాంగ్రెస్ నాయకులు ముందస్తు అరెస్టులు చేయడం దారుణమన్నారు. గత మెదక్ పర్యటనలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చడంలో విఫలమయ్యారని, స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ముందస్తు అరెస్టులకు భయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్,







బీజేపీ, నాయకులు పంజా మహేందర్, మారుతి, నసిరుద్దీన్, మధుసూదన్ రెడ్డి, అందె స్వామి, వినోద్, పంజా బాబు, ఆకుల బాలయ్య, రమేష్, రాజిరెడ్డి, చంద్రశేఖర్, ప్రవీణ్, నవీన్, సులేమాన్, ప్రవీణ్ రెడ్డి, ఏబీవీపీ నాయకులు ప్రశాంత్ అయ్యవారు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

**నవ తెలంగాణ-టేక్మాల్ :** అభివృద్ధిని అడ్డుకోవడం కాంగ్రెస్, కమ్యూనిస్టులు, బీజేపీల లక్ష్యం కాదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ అన్నారు. బుధవారం కేసీఆర్ సభ ఉందని తమను ముందస్తు అరెస్టులు చేసి తమ కుటుంబాలను భయభ్రాంతులను గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమకు నచ్చిన నాయకుని ఎన్నుకోవడం తిరస్కరించడం వ్యక్తిగత స్వేచ్ఛ అని అలాంటి స్వేచ్ఛను హరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాపక్షాన ఉండి పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టులను కూడా అవకాశవాద రాజకీయాలకు వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నియంత పాలన సాగించిన హిట్లర్‌కు కూడా అదోగతి పట్టిందన్నారు. ప్రజల పక్షాన ఉన్న తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రజలు ఇది గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భక్తుల కిషోర్, ఎల్లంపల్లి సత్యనారాయణ, మజహార్, సంగమేశ్వర్, మహేష్ రెడ్డి, బీజేపీ నాయకులు శ్యామయ్య, రెడ్డి నాయక్, సిద్ధి రాములు, ఎల్లుపేట రాజ్‌లు ఉన్నారు.



## ప్రగతి శంఖారావంకు తరలిన బీఆర్ఎస్ నాయకులు











**నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్**

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్ పట్టణంలో నూతన కలెక్టరేట్ భవనం, ఎస్పీ కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవాల కార్యక్రమం అనంతరం నిర్వహించే బహిరంగ సభకు తూప్రాన్ మనోహరాబాద్ మండలాల నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు, మనోహరాబాద్ మండలంలోని కోనాయిపల్లి గ్రామం నుంచి రాష్ట్ర నాయకులు భాష బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, సర్పంచ్ ప్రభావతిల ఆధ్వర్యంలో గ్రామం నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించారు. అలాగే లింగారెడ్డిపేట గ్రామం నుంచి నాయకులు శివగోని పెంటా గౌడ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున జనాలను సమీకరించి తరలించారు. జెడ్పీ ఛైర్ పర్సన్ రాకల హేమలత శేఖర్ గౌడ్, మండల ఇంచార్జ్ కొట్టాల యాదగిరి ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు పురం మహేష్ ముదిరాజ్‌లు లింగారెడ్డిపేట గ్రామానికి చేరుకుని జనాలను తరలించే బస్సులను ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గానికి చెందిన తూప్రాన్ మనోహరాబాద్ మండలాల నుంచి టార్గెట్‌కు మించి జనాలను తరలించారు. మండలంలోని ప్రతి గ్రామంలో నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా బహిరంగ సభకు తరలి వెళ్లారు.

**టార్గెట్‌కు మించి తరలించాం..**

మెదక్ పట్టణంలో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు తూప్రాన్ మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. తూప్రాన్ మండల పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్ రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కావేరి గారి భగవాన్ రెడ్డిల ఆధ్వర్యంలో మండలం నుంచి టార్గెట్‌కు మించి జనాలను తరలించారు. యావపూర్ నాగులపల్లిలతోపాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా జనాలను తరలించారు. మున్సిపల్ నుండి ఛైర్మన్ బొంది రాఘవేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు సరాఫ్ సతీష్ చారిల ఆధ్వర్యంలో కౌన్సిలర్లు నాయకులు ప్రజలను తరలించారు

**నవతెలంగాణ-నర్సాపూర్**

జిల్లా కేంద్రమైన మెదక్‌లో సీఎం భారీ బహిరంగ సభకు బుధవారం నర్సాపూర్ నియోజకవర్గ నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాలలో తరలి వెళ్లారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు , గ్రామాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున వారి వారికి కేటాయించిన వాహనాలలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా హత్నూర మండలం కొత్తగూడెం, గ్రామానికి చెందిన లకావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఆ గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. అనంతరం నర్సాపూర్‌కు చేరుకొని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాకతో ఒక్కసారిగా కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ స్వాగతం పలికి మెదక్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు తరలి వెళ్లిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు లకావత్ రమేష్ నాయక్, అంబర్ సింగ్ సురేష్ నాయక్ , శివాజీ నాయక్ రాము నాయక్ ఉన్నారు.

**నవతెలంగాణ-చేగుంట**

చేగుంట మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళ సభ్యులు, ప్రజలు, ప్రగతి శంఖారావానికి భారీ సంఖ్యలో బయలుదేరుతున్నామని మండల పార్టీ అధ్యక్షులు తాడెం వెంగళరావు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను సీఎం కేసీఆర్ ప్రారంభించి, అక్కడే ప్రగతి శంఖారావం బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారన్నారు. చేగుంట మండల అన్ని గ్రామాలలో 80 డీసీఎంలు, 50 బస్సులు, 500 కార్లు, 200 టాటా ఏసీలు, ఏర్పాటు చేశామని, ఎవరికి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని ఈ సభను విజయవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**నవ తెలంగాణ-నిజాం పేట**

మెదక్‌లో జరిగే ప్రగతి నివేదన సభకు నిజాంపేట మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు మహిళలు, పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రం నుంచి మెదక్‌లో నిర్వహించే ప్రగతి నివేదన సభకు నిజాంపేట మండల యువత పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి కామిని శ్రీనివాస్, బీఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు రంజిత్ గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మెదక్ పట్టణంలో కలెక్టర్, ఎస్పీ కార్యాలయ భవనాలను ప్రారంభించడానికి విచ్చేయుచున్నారని తెలిపారు. అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో నేపథ్యంలో మెదక్ నుండి ఎన్నికల శంఖారావం పూరిస్తున్నారన్నారు. ఈ సభకు నిజాంపేట మండలం నుంచి సుమారు 6000 పైచిలుక కార్యకర్తలు బయలుదేరి వెళ్లారన్నారు. రానున్న ఎన్నికలలో మెదక్ నియోజకవర్గంలో యువత సైనికుల పనిచేస్తూ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డిని లక్షకు పైచిలుగా మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ సిద్ధ రాములు, సుధాకర్ రెడ్డి, మండల ఇన్చార్జి కామిని ఎల్లం, గ్రామ సర్పంచ్ అనూష, ఎంపీటీసీ లహరి కిష్టారెడ్డి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, యూత్ అధ్యక్షులు రాజు, లక్ష్మణ్, నగేష్, రాములు గౌడ్, ముస్తఫా, మైపాల్, తిరుమల గౌడ్, సత్యనారాయణ, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను బుధవారం పశు వైద్యాధికారి ఉమానాయక్ ఆధ్వర్యంలో వేశారు. ఈ సందర్భంగా సీనియర్ పశువైద్యాధికారి విజయ్ భార్గవ్ హాజరై పశువులను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం తెల్లనివి 45, నల్లనివి 62 కలిపి 107 పశువులకు టీకాలు అందించామని అన్నారు. ఇంకెవరైనా టీకాలు వేయించని వారు ఉంటే పశువైద్యాధికారి ఉమ నాయక్ ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు బాల్ రెడ్డి, ఆఫీస్ సబార్డినేట్ వెంకటేశం , తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ నాయకుల అరెస్ట్



నవతెలంగాణ-అక్కన్నపేట

దళిత, బీసీ, గిరిజన బంధు, డబల్ బెడ్ రూమ్, గృహలక్ష్మి, కొత్త రేషన్ కార్డులు, నిరుద్యోగ భృతి మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడికి సిద్ధమవుతున్న అక్కన్నపేట బిజెపి నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు నునావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. పోలీసులను పెట్టి అరాచక పాలన కొనసాగిస్తుందని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల ఉపాధ్యక్షుడు దాసరి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకు సంపత్, మండల నాయకులు గుగులోత్ రాజు నాయక్ లు,అరెస్టు అయ్యారు.

# ఆరేపల్లి ఆశలు ఆవిరి?



- అసంతృప్తితో ఆరేపల్లి అనుచరుల మంతనాలు
- కాంగ్రెస్‌లో చేరాలని ఒత్తిడి

నవతెలంగాణ-బెజ్జంకి

మేరుగైన ఫలితాలు సాధించి ముచ్చటగా మూడోసారి రాష్ట్రంలో అధికారం చేపట్టాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఊరట కలిగించిన ఆశావహుల ఆశలు ఆవిరయ్యాయనే ఆరోపణలు అసంతృప్తుల్లో వ్యక్తమవుతున్నాయి. తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా సముచిత స్థానం కల్పిస్తారనే ఎన్నో ఆశలతో ఎదురుచూసిన ఆశవాహుల ఆశలు సీఎం కేసీఆర్ ముందస్తుగా ప్రకటించిన అభ్యర్థుల జాబితాతో గల్లంతయ్యాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ కాంగ్రెస్ పార్టీని వీడీ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.మానకొండూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయిస్తారని ఆరేపల్లి ఆశించి భంగపాటు గురయ్యాడని తన అనుచరులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించి కాంగ్రెస్ పార్టీని వీడడమే ఆరేపల్లి చేసిన పోరపాటని..

కాంగ్రెస్‌తోనే భవిష్యత్తని..తిరిగి తన స్వంతగూటీకి కాంగ్రెస్ పార్టీలో చేరాలని మేజారిటీ అనుచరులు ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది.కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అభ్యర్థిగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దాదాపుగా ఖారరవ్వడంతో..తన అనుచరుల ఒత్తిడి మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరిన అ పార్టీలోనైనా న్యాయం జరుగుతుందా? లేదా? ఆలోచనలో ఆరేపల్లి ఉన్నట్టు తెలుస్తోంది. అనుచరుల ఒత్తిడి మేరకు ఆరేపల్లి తన స్వంత గూటీకి చేరుతారా? లేకా?మరో దారి వెతుకుంటారా? వేచి చూడాల్సిందే.

## గుంతల రోడ్డుపై వెళ్లేదెలా?



- తరచూ ప్రమాదాలు ఇక్కడే

నవతెలంగాణ-దుబ్బాక

గుంతల రోడ్డుపై ప్రయాణం వాహనదారులకు నరకప్రాయమైంది. తరచూ ప్రమాదాలు ఇక్కడే జరగడంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. రోడ్డు నిండా పెద్ద గుంతలు, దాని చుట్టూ చిన్న చిన్న గుంతలు ఏర్పడ్డాయి. చెరువు నుంచి వస్తున్న జాలు నీరు ఆ గుంతల్లో నిలుస్తున్నాయి. దీంతో గుంతలు ఉన్న విషయం వాహనదారులకు తెలియకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని దుబ్బాక- లచ్చపేట వెళ్లే ప్రధాన దారిలో "పెద్దమ్మ దేవాలయం వద్ద రోడ్డునిండా గుంతలు" ఏర్పడి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతలు ఏర్పడి నెలలవుతున్నా అధికారులు, పాలకులకు వాటిని పూడ్చడం, మరమ్మతు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ గుంతల్ని పూడ్చాలంటూ గతంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు గుంతల రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఇదివరకే ఓసారి ముదిరాజ్ సంఘం సభ్యులు ఆ గుంతల్ని పూడ్చారు. గత కొద్ది రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుపై మళ్ళీ గుంతలు తేలాయి. ఈ మార్గం గుండా వెళ్లే ప్రయాణికులు పాలకులు, అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి వెంటనే రోడ్డు మరమ్మత్తు పనులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

## కులవృత్తులను ఆదుకుంటున్న సీఎం కేసీఆర్



నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కులవృత్తులకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటున్న ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని సర్పంచ్ బద్దిపడగ లలిత కృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో గొల్ల కురుమలకు నాలుగు యూనిట్ల గొర్రెల పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులవృత్తులను సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని ఆమె అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సంక్షేమ పథకాలు భారతదేశంలో ఎక్కడా లేవని ఆమె తెలిపారు.గొల్ల కురుమల కు గొర్రెల పంపిణీ తో వారి కుటుంబాలలో వెలుగులు నిండుతున్నాయని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి హరికృష్ణ, చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ శనిగరం సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఎల్లయ్య డీలర్ బాదల్, పాల్గొన్నారు.

## సీఎం సభకు తరలిన దుబ్బాక నేతలు



నవతెలంగాణ-దుబ్బాక

మెదక్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల భవనాలను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్న నేపథ్యంలో బుధవారం దుబ్బాక మున్సిపల్ బిఆర్ఎస్ నేతలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపుమేరకు సీఎం సభకు తరలి వెళ్లడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు దివిటీ కనకయ్య,ఇల్లందుల శ్రీనివాస్, ఆస యాదగిరి, కోఆప్షన్ సభ్యులు ఆస స్వామి, ఏఎంసీ డైరెక్టర్ ఖలీల్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గన్నె భూమి రెడ్డి, బట్టు ఎల్లం, పులిగారి ఎల్లం, నందాల శ్రీకాంత్, గోనెపల్లి సంజీవరెడ్డి, మల్లేశం, లొంక లచ్చయ్య దొమ్మాట భూపాల్, పడాల నరేష్, పలువురున్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన సోలిపేట సుజాత



నవతెలంగాణ-దౌల్తాబాద్

దుబ్బాక నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్ తమ్ముడు ప్రకాష్ వివాహం మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని విఆర్ పంచ రాంరెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ వివాహానికి దివంగత దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు సోలిపేట సుజాత రామలింగారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు మండల వైస్ ఎంపీపీ అల్లి శేఖర్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు నర్ర రాజేందర్, కోనాపూర్, ఎంపీటీసీ మల్లేశం, గోవిందపూర్ తాజా మాజీ సర్పంచ్ గుడిసె చంద్రమౌళి గౌడ్ గ్రామ అధ్యక్షుడు చిక్కుల స్వామి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట అసెంబ్లీ కోసం దరఖాస్తు సమర్పించిన డాక్టర్ సూర్యవర్మ



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ కోసం జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ డాక్టర్ సూర్య వర్మ హైదరాబాద్ గాంధీ భవన్ లో బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెనుకబడిన తరగతి నుంచి వచ్చి డాక్టర్‌గా, 40 ఏళ్లగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న కుటుంబానికి చెందిన తనకు సిద్దిపేట అసెంబ్లీ అభ్యర్థిగా పీసీసీ తప్పకుండా ప్రకటిస్తుందని, నూటికి నూరు శాతం విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో చాలా చురుగ్గా పాల్గొంటున్నట్లు తెలిపారు. పీసీసీ, ఏఐసీసీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ యువతను తప్పకుండా ప్రోత్సహిస్తుందని తాను బలంగా నమ్ముతున్నానని, చదువుకున్న వ్యక్తి అయిన తనకు కచ్చితంగా టిక్కెట్ ఇస్తుందనే నమ్మకం తనకు ఉందని అన్నారు. గత 40 ఏళ్లగా గొప్ప అనుభవం ఉన్న కుటుంబానికి చెందిన వ్యక్తినని, పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తున్నానని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సామల సంతోష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మున్నా, డీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి దిలీప్, జంగోని శ్రీనివాస్, సీతాబాలు, సిరాజ్, మండల అధ్యక్షులు బంకా చిరంజీవి, మిద్దె ప్రసాద్ , మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రూరల్ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ రమేష్, నాయకులు రాజు, క్రాంతి, జిత్తు పాలగొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి



నవతెలంగాణ-మిరుదొడ్డి

దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేయడం హర్షనీయమని దివ్యాంగుల జిల్లా నాయకుడు ఐలయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో దివ్యాంగులతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో దివ్యాంగులకు ఈ నెల నుండి పెంచిన పెన్షన్ 4016 రూపాయల దివ్యాంగుల ఖాతాలో జమ కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. ఆత్మగౌరవంతో దివ్యాంగులు బతికేలా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దివ్యాంగులు ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు రాజేశ్వర్, మల్లికార్జున్, రాజు పాల్గొన్నారు.

## 19వ వార్డులో పూల మొక్కల పంపిణీ



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన హరితహారం 9వ విడత కార్యక్రమంలో భాగంగా బుధవారం 19వ వార్డులో కౌన్సిలర్ బొజ్జ హరీష్ పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో పర్యావరణ ఆఫీసర్ రవి కుమార్, హరిత హరం సూపర్ వైజర్ ప్రశాంత్,బి ఆర్ ఎస్ పట్టణ మహిళ అధ్యక్షురాలు బండి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ అసెంబ్లీస్థానానికి పోటీ చేయనున్న నీరుడి ప్రసాద్



నవతెలంగాణ-గజ్వేల్

రాబోయే ఎన్నికల్లో గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు సామాజిక కార్యకర్త నిరుడు ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముంపు ప్రాంత వాసి గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన సామాజిక కార్యకర్త నీరుడు ప్రసాద్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గజ్వేల్ నియోజక వర్గం ఎమ్మెల్యే ఎన్నికల్లో నామినేషన్ వేస్తానన్నారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల నుండి ముంపు గ్రామ బాధితులకు ఏమాత్రం న్యాయం జరగలేదు కడుపులో పెట్టుకొని చూస్త అన్న ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపు చూస్తున్నట్లు చెప్పారు. సర్వం కోల్పోయిన ప్రజలకు అండగా ఉంటానన్న ప్రభుత్వం గజ్వేల్ లో ఒక మూలకు చిన్న చిన్న ఇండ్లు ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు ఆయన ఆవేదన చెందారు. ఉపాధి లేక ప్రజలు నాన ఇబ్బందులు పడుతున్నారన్నారు. మల్లన సాగర్ నిర్మాణం పూర్తి అయ్యాక ముంపు గ్రామాల ప్రజలను పట్టించు కోవడంలేదన్నారు. ఉపాధి లేక అల్లాడిపోతున్న యువత వ్యవసాయం చేయలేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చ కపోవడం సిగ్గుచేటు అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తప్పకుండా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ముంపు గ్రామాల ప్రజలకు అండగా ఉంటానని ధీమా వ్యక్తం చేశారు.

## పాఠశాలకు ప్రింటర్ అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు జగదేవపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గర్నెపల్లి నాగార్జునసాగర్ కలర్ ప్రింటర్ అండ్ స్టూడెంట్ ఫైల్స్‌ను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ రాధాకృష్ణకు సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లలైన శ్రీహర్ష హరిణి లను అంగడికిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాని, పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో కలర్ ప్రింటర్ %డ% స్టూడెంట్ ఫైల్స్ ను అందజేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్ , పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బాల్ రెడ్డిలు మాట్లాడుతూ ఒక ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉంటూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివించడమే కాకుండా పాఠశాలకు అవసరమైన కలర్ ప్రింటర్అండ్‌స్టూడెంట్ ఫైల్స్ అందించిన నాగార్జునసాగర్ అభినందనీయుడన్నారు.అనంతరం దాత నాగార్జున సాగర్ ను శాలువాతో సత్కరించారు . ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి ,హారిక ,గ్రామ యువకులు సుదర్శన్ గౌడ్, మహేష్ ,తదితరులున్నారు.

## ఏఎన్ఎంల పట్ల ప్రభుత్వ వైఖరి వీడనాడాలి



- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె అశోక్
- మోకాళ్లపై కూర్చుని నిరసన

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సెకండ్ ఏఎన్ఎంల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వీడనాడాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సెకండ్ ఏఎన్ఎంలు చేస్తున్న సమ్మె బుధవారం 8వ రోజుకు చేరుకుంది. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సమ్మె వేదిక వద్ద ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఏఎన్ఎంలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నేత అందే అశోక్ హాజరై మాట్లాడుతూ కరోనా సమయాల్లో ప్రజలకు అనేక సేవలు అందించి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని మూడవ స్థానంలోకి తీసుకొచ్చి ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని నోటిఫికేషన్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏఎన్ఎంలు కార్మిక సంఘం నాయకులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. లేదంటే ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బెక్కంటి సంపత్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మిట్టపల్లి సుధాకర్, సెకండ్ ఏఎన్ఎం లు తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ సంస్మరణ సభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-జగదేవపూర్

ప్రజాయుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని టిపిటిఎఫ్ జగదేవపూర్ మండల అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి సత్తయ్య పేర్కొన్నారు. బుధవారం జగదేవపూర్ మండలం తిగుల్ పాఠశాలలో గద్దర్ యాదిలో సంస్మరణ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాయుద్ధనౌక గద్దర్ తరతరాలకు ఆదర్శమని, ఆయన పాట మాట ఆటతో ప్రజలను చైతన్యవంతం చేసిన గొప్ప వాగ్గేయకారుడు కవి అన్నారు. గద్దర్ మరణం ప్రపంచానికే తీరని లోటన్నారు. నేటితరానికి గద్దర్ చరిత్ర ఎంతో అవసరమని తెలిపారు. గద్దర్ సంస్మరణ సభను టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో గజ్వేల్ లో గురువారం సాయంత్రం టివైఆర్ గార్డెన్ లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరుణోదయ విమలక్క, ప్రొఫెసర్ కాశీంలతో పాటు మేధావులు హజరు అవుతున్నట్లు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, గద్దర్ అభిమానులు అధిక సంఖ్యలో హజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నంగునూరు

మహిళలు కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఆంజనేయులు అన్నారు. బుధవారం నంగునూరు మండలం పాలమకుల గ్రామంలో రెండో విడత స్వచంద కుట్టు మిషన్ కేంద్రాన్ని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్యతో కలిసి ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పంగ కుమార్, ఎంపీటీసీ ఏటి తులసి పరమేశ్వర్,గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ యాదవ్, గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఏల్పుల ఐలయ్య, మాజీ సర్పంచ్ ఎల్లంకి రవీందర్ రెడ్డి, మహిళ నాయకులు గంగవ్వ, రేషన్ డీలర్ మహేష్, బీఆర్ఎస్వై యువజన నాయకులు ఇమ్రాన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఆత్మగౌరవ పాదయాత్ర



నవతెలంగాణ-మిరుదొడ్డి

జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం కూడవెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మగౌరవ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు సెంట్రింగ్ పని చేస్తూ గాయపడిన చెరుకు బాను ఆయన పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని తెలియజేశారు. త్వరగా భాను కోలుకోవాలని చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. ఏకకాలంలో రుణమాఫీ చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ నేటికీ లక్ష రూపాయల లోపు ఉన్న రుణాలను మాఫీ చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని ప్రజలకు సూచించారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ అనునిత్యం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## అభివృద్ధి ఒక భూటకం, కేసీఆర్, హరీష్ రావుల నాటకం



నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణలో అభివృద్ధి ఒక భూటకమని, ఇది కేసీఆర్, హరీష్ రావుల నాటకమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మండిపడ్డారు. బుధవారం నంగునూరులో విలేకర్లతో మాట్లాడారు. మెదక్ జిల్లాకు కేసీఆర్, సిద్దిపేట నియోజకవర్గానికి హరీష్ రావు చేసిందేమీ లేదని ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వంతో ప్రజలకు ఒరిగిందేమి లేదని ఏద్దేవా చేశారు. తెలంగాణలో కేసీఆర్, హరీష్ రావులు అంటెనే కమీషన్లు, కబ్జాలు, మోసాలు, బూటకపు మాటలే తప్ప ప్రజా పాలకులు కానే కారని విమర్శించారు. మెదక్ జిల్లాను మెతుకు జిల్లా చేసి పరిశ్రమల కిల్లా చేసిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఏమి చేయలేదని హరీష్ రావు అనడం విడ్డురంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి భూమాఫియా, ఇసుక మాఫియా వాళ్ళకు, దళిత బంధు పథకంలో దళితుల వద్ద కమీషన్లు తీసుకునే చెడ్డగాళ్ళకు ఏమ్మెల్యే టికెట్లు ఇచ్చిన మామ, అల్లుళ్లను ఉత్తములు, శ్రీరామ చంద్రులు అనుకుంటున్నారేమో, కానీ గంగలో కాకులు మునిగితే హంసలు కాలేవన్న నిజంలాగే వాళ్లు ఏమాత్రం మారని మునుపటి దొంగలు, కబ్జాకోరులేనన్నారు. ఇక వాళ్లతో కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఇబ్బంది శూన్యమని స్పష్టం చేశారు. పాత వాళ్లకే మరో సారి పోటీ చేయడానికి అవకాశం ఇచ్చినంత మాత్రాన కేసీఆర్ కుటుంబంపైన, ఆ పార్టీ ఎమ్మెల్యేల పైన వ్యతిరేకత ఉండదనుకోవడం మంత్రి మూర్ఖత్వమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెలికాని యాదగిరి, బాగు శ్రీకాంత్, గాండ్ల రమేష్, రాగుల కృష్ణ, దాసరి కిషన్, జంగిటి శ్రీనివాస్, అనరాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఘనంగా పోచమ్మ బోనాలు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని బేడ బుడగ జంగాల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పోచమ్మ బోనాలలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మిర్యాల రమేష్, బొజ్జ హరీష్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, అధ్యక్షులు మోతే సంపత్, తూర్పాటి సమ్మయ్య మిర్యాల తిరుపతి, చెన్నూరి వెంకటేశం, చెన్నూరి రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## జానకి రాములుకు విశిష్ట వైద్య శిరోమణి పురస్కారం



- సెప్టెంబర్ 10న విజయవాడలో పురస్కారం అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి

విశ్వకర్మ సేవా ట్రస్ట్ అధ్వర్యంలో అందజేయనున్న 'జాతీయ విశిష్ట వైద్య శిరోమణి' పురస్కారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు జానకి రాములును వరించింది. సెప్టెంబర్ 17 విశ్వకర్మ జయంతి ఉత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 10న విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో జానకి రాములుకు జాతీయ విశిష్ట వైద్య శిరోమణి పురస్కారాన్ని అందజేయనున్నట్టు విశ్వకర్మ సేవా ట్రస్ట్ కమిటీ సభ్యులు మాచవరం గౌరీ శంకరాచార్యులు, బాల బ్రహ్మ చారి బుధవారం తెలిపారు. గత 42 ఎండ్లుగా వైద్య వృత్తిలో విశిష్ట సేవలందిస్తున్నందుకు వైద్యులు జానకి రాములును జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్టు ట్రస్ట్ కమిటీ సభ్యులు తెలిపారు. పురస్కారానికి ఎంపికైన జానకి రాములుకు మండల ఆర్ఎంపీల సంక్షేమ సంఘం సభ్యులు, పరువురు గ్రామస్తులు అభినంధనలు తెలిపారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-మర్కుక్

ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మకమైన విద్యా అందుతుందని మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ అన్నారు.బుధవారం మర్కుక్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 500 నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పిల్లలు విద్యకు దూరం కావద్దని, విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యార్థులు బాల్యం నుంచి కష్టపడి చదువుకోవాలని తెలియజేశారు. విద్యాభివృద్ధికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాణి. ఉపాధ్యాయురాలు కవిత. విద్యార్థులున్నారు.

## నిరుద్యోగ వికలాంగులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేయాలి



నవతెలంగాణ-తొగుట

వికలాంగులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఉచిత విద్యుత్, ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఎన్పీఆర్డీ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు ఎండి.సాజిద్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో వికలాంగుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 21 రకాల వైకల్యాల ప్రకారం 43.02 లక్షల మంది వికలాంగులు ఉన్నారని తెలిపారు. వీరిలో 5.14 లక్షల మందికి పింఛన్లు వస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 12% వికలాంగులు ఉన్నారని, వికలాంగుల జనాభా కనుగుణంగా పథకాలు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో వికలాంగులకు 5 శాతం ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎక్కడ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో వికలాంగులకు వాటా కేటాయించాలన్నారు. ప్రతి వికలాంగునికి ఉచిత విద్యుత్తు, ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ సవరించి వికలాంగుల రోస్టర్ 10 లోపు మార్చాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ వికలాంగులకు సహాయం ఉపాధి కోసం ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు 5 శాతం కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 33ను పటిష్టంగా అమలు చేసి, స్థలమున్న వికలాంగులం దరికీ మంజూరు చేయాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాంపులు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.21 రకాల వైకల్యాల వారికి ప్రభుత్వం ధ్రువీకరణ పత్రాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.40% వైకల్యం కలిగిన వికలాంగులందరికీ పింఛన్లు, బస్సు పాసులు మంజూరు చేయాలని, లేని ఎడల రాష్ట్ర వ్యాప్తంగా భారీ నిరసన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఆర్డీ జిల్లా గౌరవాధ్యక్షులు జి.భాస్కర్, మండల నాయకులు నరేష్, రజిత, మల్లయ్య, కావ్య, యాదయ్య, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి సంతోషిమాత దేవాలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని శ్రీ సంతోషిమాత దేవాలయం 31 వార్షికోత్సవం ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ మంకాల నవీన్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 25న వరలక్ష్మి శుక్రవారం భక్తుల రాక అధిక సంఖ్యలో ఉంటుందని, దర్శనం కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరలక్ష్మీ శుక్రవారం రోజున అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో దర్శనం ఉంటుందని, ఉద్యాపన పూజా, వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మాజీ చైర్మెన్ కాచం కాశీనాథ్, తమ్మిశెట్టి వీరేశం, బచ్చు రమేశ్, ధర్మకర్తలు గాదగొని సత్యం గౌడ్, కాముని ప్రభాకర్, చకిలం అమర్నాథ్, కొమరవెల్లి కళ్యాణి, ఎక్స్ అఫిషియో సభ్యుడు శాకం మధుసూధన్ రావు, గరిపల్లి సువర్ణ, అర్చకులు రామకృష్ణ, మాజీ ధర్మకర్తలు చింత సంతోష్ కుమార్, గందె మాధురి, సొప్పదండి రాము, సిబ్బంది శంకర్, వాసు పాల్గొన్నారు.

## మైనంపల్లిపై క్రమశిక్షణా రాహిత్య చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-బెజ్జంకి

మెదక్ అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధిష్టానం క్రమశిక్షణా రాహిత్య చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి జంగిటి శంకర్ డిమాండ్ చేశారు. మంత్రి హరీశ్‌రావుపై మైనంపల్లి చేసిన వ్యాఖ్యలను శంకర్ బుధవారం ఖండించారు. మైనంపల్లి చేసిన అనుచిత వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు చూపిస్తాయని త్వరితగతిన క్రమశిక్షణ రహిత్య చర్యలు చేపట్టాలని అధిష్టానాన్ని విజ్ఞప్తి చేశారు.

## సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు అందజేసిన గాడి పల్లి రఘువర్ధన్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట , దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ గాంధీభవన్‌లో దరఖాస్తు ఇచ్చినట్లు గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ శ్రేణులు, తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు అందజేసినట్లు తెలిపారు. ఎన్ ఎస్ యు ఐ, ఎన్ ఆర్ ఐ గా కాంగ్రెస్ పార్టీకి అనేక సంవత్సరాలు సేవలందిస్తున్నానని తెలిపారు. అనేక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఆవు మృతి



**నవతెలంగాణ-నంగునూరు:** పిడుగు పాటుకు ఆవు మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం అంక్షాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. అంక్షాపూర్ సర్పంచ్ పినకేశి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఆవును ఎప్పటి లాగానే పశువుల పాకలో కట్టేశాడు. మంగళవారం రాత్రి పిడుగుపాటుకు ఆవు చనిపోవడం జరిగింది. దీని విలువ సుమారు 95 వేల వరకు ఉంటుందని తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-మిరు దొడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని మిరుదొడ్డి తహసీల్దార్ గోవర్ధన్ సూచించారు. నూతన ఓటరు జాబితా ప్రతి గ్రామానికి రావడం జరిగిందని తెలిపారు. ఓటర్ లిస్టులో పేరు రాకపోయినా ఏవైనా తప్పులు ఉంటే సరి చేయడం జరుగుతుందని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే అక్టోబర్ 19వ తేదీ లోపు సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన దేవులపల్లి (శివన్న గారి) మధుకర్ (38) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు మధుకర్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబ పరిస్థితి కాలనీవాసులు గ్రామ సర్పంచికు తెలియజేశారు. స్పందించిన నంగునూరు గ్రామ సర్పంచ్ మమత జైపాల్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంత్రి ఆదేశాల మేరకు సర్పంచ్ మమత జయపాల్ రెడ్డి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కులం పెద్దమనిషి కట్ట పెద్ద భూమయ్య, చిన్న సిద్దయ్య,బీఆర్ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కనకయ్య, వార్డు మెంబర్ దేవులపల్లి గణేష్, ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్, దేవులపల్లి బిక్షపతి, దేవులపల్లి కృష్ణ, లింగాల నర్సింహులు, దేవులపల్లి (దొమ్మాట) కిష్టయ్య, దేవులపల్లి కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహితంగా ప్రభుత్వ పాఠశాల

- విద్యార్థులకు స్టీల్ ప్లేట్స్, గ్లాసులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ప్లాస్టిక్ వాడటం వలన వచ్చే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలను ప్లాస్టిక్ రహిత పాఠశాలగా మార్చడానికి సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు నడుం బిగించారు. బుధవారం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 150 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తన్నీరు రేణుక శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని పేపర్ ప్లేట్స్ పాలిథిన్ కవర్స్ లాంటివి పాఠశాలకు తీసుకురాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. విద్యార్థులకు స్టీల్ ప్లేట్స్, గ్లాస్ పంపిణీ కార్యక్రమానికి ముందుకు వచ్చిన స్థానిక వార్డు మెంబర్స్ పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి, రాముల నర్సింలు, దుద్దెడ కనకయ్యలను ప్రధానోపాధ్యాయులు ఉమారాణి స్థానిక ఉపాధ్యాయ బృందం సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక డిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు బాపిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, బీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనంపల్లిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-దుబ్బాక

మంత్రి హరీష్ రావుపై మైనంపల్లి హనుమంతరావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదుట మైనంపల్లి హనుమంతరావు, ఆయన కుమారుడు రోహిత్ రావు దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎలారెడ్డి మాట్లాడుతూ మంత్రి హరీష్ రావుపై మైనంపల్లి హనుమంతరావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మైనంపల్లి హనుమంతరావుతో పాటు ఆయన కుమారున్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. కౌన్సిలర్లు ఆస యాదగిరి, ఇళ్ళందుల శ్రీనివాస్, దివిటి కనకయ్య, బత్తుల స్వామి, కో ఆప్షన్ సభ్యులు ఆస స్వామి, ఏఎంసి డైరెక్టర్ మహమ్మద్ ఖలీల్, బిఆర్ఎస్ దుబ్బాక మండలాధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, నాయకులు గన్నె భూమిరెడ్డి, కొత్త కిషన్ రెడ్డి, వడ్లకొండ శ్రీధర్, పల్లె రామస్వామి గౌడ్, నందాల శ్రీకాంత్, గోనెపల్లి సంజీవరెడ్డి, బట్టు ఎల్లం, మూర్తి శ్రీనివాస్ రెడ్డి, పులిగారి ఎల్లం, శ్రీరామ్ రామకృష్ణ ప్రభు, దొమ్మాట భూపాల్, లోంక లచ్చయ్య, హర్ద్ పండు, మల్లేశం, వెంకట్‌చారి, నరేష్, పలువురున్నారు

## పట్టణ పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత

- మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్



నవతెలంగాణ- సిద్దిపేట

పట్టణ పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యతను ప్రజాప్రతినిధులు, ప్రజలు ఇస్తున్నారని, కానీ కొంతమంది ఆరుబయట చెత్తను పారవేస్తున్నారని, అలా చేయకుండా తమ ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు చెత్తను ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించారు. 11వ వార్డులో కాలకుంట్ల కాలనీలో వికలాంగుల సంక్షేమ భవనం వైపున రోడ్డుకు ఇరువైపులా పిచ్చి గడ్డి తొలగింపు పనులు, 27వ వార్డులో సాయి బాబా దేవాలయం వద్ద మురికి కాలువలు శుభ్రం చేస్తున్న పనులను పరిశీలించారు. వార్డులో ప్రజలతో మాట్లాడుతూ ఏవైనా మున్సిపల్ పరమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ఎక్కడ కూడా అపరిశుభ్రత ఉండకూడదని శానిటరీ ఇన్స్పెక్టర్ సతీష్‌ను ఆదేశించారు. స్వచ్ఛ సిద్దిపేట కొరకు మంత్రి హరీశ్ రావు అహర్నిశలు కృషి చేస్తున్నారని, అందరం కలిస్తేనే స్వచ్ఛ సిద్దిపేట సాధ్యమన్నారు. ప్రతిరోజూ తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి చెత్త వాహనానికి అందివ్వాలని అవగాహన కల్పించారు. అనంతరం బేసిల్ ఫౌండేషన్ తెలంగాణ వారి కమర్షియల్ కలెక్షన్ డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్‌లో పనులను పరిశీలించారు.

# చంద్రయాన్-3 విజయవంతం కావాలని పూజలు



నవతెలంగాణ- గజ్వేల్

భారత్ ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావాలని కోరుతూ బుధవారం శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో కృష్ణాలయంలోని రామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు మాట్లాడుతూ ప్రపంచదేశాలు కూడా మన భారత్ తలపెట్టిన చంద్రయాన్-3 మీద దృష్టి పెట్టారు. మనము ఎన్నో విజయాలను సాధించామని ఈ విజయం కూడా తప్పకుండా సాధించి ప్రపంచ పటానా మన దేశం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కృష్ణాలయం అధ్యక్షుడు యెలగందుల రాంచంద్రం, ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, ధార రామచంద్రం, దొంతుల దశరథం, బండి శ్రీనివాస్, చకిలం చిరంజీవి, తుమ్మ శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్, రవిచారి, వేములవాడ కనకాచారి, పాల్గొన్నారు.

# దేశంలో ఎదురులేని శక్తిగా బీఆర్ఎస్



నవతెలంగాణ-మర్కుక్

దేశంలో ఎదురులేని శక్తిగా బీఆర్ఎస్ పార్టీ మారనున్నందని మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ, సిఎం కెసిఆర్ నేతృత్వంలో మెదక్ లో నిర్వహించిన ప్రగతి శంఖారావం బహిరంగ సభకు వెళ్లడానికి నర్సాపూర్ నియోజక వర్గం కొల్చారం ఇంచార్జిగా ఉన్న ఆయన మండల వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కొల్చారం మండల వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ,వివిధ బీఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షులు, ముఖ్య నాయకులు ,కార్యకర్తలు తదితరులున్నారు.

# జేపీ తండాకు పోలింగ్ కేంద్రం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని జేపీ తండా గ్రామానికి నూతనంగా పోలింగ్ కేంద్రం మంజూరైనట్లు సర్పంచ్ బిక్షపతి నాయక్ తెలిపారు. బుధవారం జేపీ తండా గ్రామంలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు సహకారంతో నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు,ఓటర్ లిస్టు పరిశీలన,అంగన్వాడీ టీచర్ ద్వారా నూతన ఓటర్ నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నూతన పోలింగ్ సెంటర్ ఏర్పాటుకు సహకరించిన మంత్రి తన్నీరు హరీష్ రావు, జిల్లా కలెక్టర్, ఎంపీపీ, జడ్పీటీసీ, తహశీల్దార్,ఎంపీడీవోకు మా గ్రామం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.



## సీఎం సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

**నవతెలంగాణ-జహీరాబాద్**

మెదక్‌లో జరిగిన ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు జహీరాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. వారిలో బీఆర్ఎస్ నాయకులు, జహీరాబాద్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, ఇప్పేపల్లి సొసైటీ చైర్మెన్ మచ్చేందర్, ఇప్పేపల్లి సర్పంచ్, మొగుడంపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బంగారు సురేష్, జహీరాబాద్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఉగ్గేల్లి తాండ సర్పంచ్ శెట్టి రాథోడ్, ఎంపీటీసీలు ఇస్మాయిల్, శంకరయ్య, బస్వరాజ్, సర్పంచులు దిడిగి కరణ్ రాజ్, శేఖపూర్ చిన్న పటేల్,రాయిపల్లి విజయ్,శేఖపూర్ తాండ నాగు,తుంకుంటా రాజు,ఖాంజమాల్ పూర్ ప్రసాద్, బుర్ది పాడ్ అబ్రహం, లచ్చు నాయక్ తాండ నెహ్రు తదితరులున్నారు.



## గురువుల ఆశీస్సులతోనే ఉన్నత స్థాయికి ఎదిగాం

**నవతెలంగాణ-జహీరాబాద్**

గురువుల ఆశీస్సులు, సూచనలతోనే తాము ఈ స్థాయికి ఎదగలిగినామని మాణిక్ ప్రభు పాఠశాల పూర్వ విద్యార్థులు అన్నారు. స్థానిక శ్రీ మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలలో 2007- 8వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మే ళనం నిర్వహించారు. ఆనాటి రోజులని గుర్తుచేసుకొని తమకు బోధించిన ఉపాధ్యాయులకు బహుమతి ప్రదానాలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య వికలాంగుడు అయినప్పటికీ తమకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచి సూచనలు, సలహాలు ఇచ్చారని.. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని తాము విద్యను అభ్యసించినామన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య మాట్లాడుతూ.. ఈ పాఠశాల నుంచి పదో తరగతి పూర్తి చేసుకుని 15 ఏండ్లు అయినందున వివిధ స్థాయిలో స్థిరపడిన విద్యార్థులను ఎంతగానో అభినంది ంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘు,నర్సింలు కిష్టయ్య, మధుమతి, సుధా,అరుణ.కుల్కర్ణి, పూర్వ విద్యార్థులు పోషకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలనుపరామర్శించిన చెరుకు

**నవతెలంగాణ-దౌల్తాబాద్**



కాశీ పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమా దంలో సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకురాలు పబ్బా మాధవి అశోక్.. అలాగే దౌల్తాబాద్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షు డైన గొల్లపల్లి నగేష్ తండ్రి గొల్లపల్లి లింగయ్య గత వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ముత్యంరెడ్డి తనయుడు దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి బుధ వారం బాధిత కుటుంబాలను వేరువేరుగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు గొడుగుపల్లి మాజీ ఎంపీటీసీ స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు

## బాలల సంరక్షణకు సమిష్టి కృషి

**నవతెలంగాణ-కొండాపూర్**



బాలలను రక్షిం చుకునేం దుకు సమిష్టిగా కృషి చేయాల ని చిల్డ్రన్ డెవలప్మెం ట్ ఫీల్డ్ ఆఫీసర్ పి.రేణుక అన్నారు. మండలంలోని గోపారం అంగ న్వాడి సెంటర్ ను బుధవారం వారు సందర్శి ంచి.. మాట్లాడా రు. పిల్లల అభివృద్ధిలో మైలురాళ్ల గురించి తల్లులతో మాట్లాడి.. పిల్లల పెరుగుదల, పోషకాహారం సంరక్షణ, భద్రత వంటి అంశాల గురించి పిల్లల తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ రత్నమాల, అంగన్వాడి టీచర్ అనసూయ, యూనిసెఫ్ టీమ్ పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

**నవతెలంగాణ-గుమ్మడిదల**

18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు విని యోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ పరిధిలోని ప్రకృతి నివాస్ కాలనీలో పలువురు రెవెన్యూ, మండలాభివృద్ధి అధికారులు, కాలనీ వాసులతో అవగాహనా సదస్సును కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ మాట్లాడుతూ.. కాలనీవాసులు ప్రతీ ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నారని.. అయినప్పటికీ తమ ఓటు హక్కును వినియోగించుకోకపోవడం దురదృష్టకరమ న్నారు. బుధవారం కాలనీలో ఉన్న ప్రతి కుటుంబంలో 18 ఏండ్లు పైబడి ఉన్న వారిని కాలనీ అసోసియేషన్ వారు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించలని కోరారు. కార్యక్ర మంలో జిల్లా ఎస్పీ రమణ కుమార్, ఆర్డీవో రవీందర్, తహసిల్దార్ గంగాభవాని, ఎంపీడీవో చంద్రశేఖర్, ప్రకృతి నివాస్ అసోసియేషన్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, సెక్రటరీ శ్రీధర్, కోశాధికారి వీణషెట్టి, వైస్ ప్రెసిడెంట్ వార్డు సభ్యులు నీనాగోస్వామి, కాలనీవాసులు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణుల నిరసన

- పలువురి ముందస్తు అరెస్ట్

**నవతెలంగాణ-జహీరాబాద్**

బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర దామోదర్ రాజ నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబా జగన్నాథ్ మాట్లాడ ుతూ.. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ తన మేనిఫె స్టోలో పెట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లు, దళితబంధు, బీసీబంధను అందరికీ అమలు చేయకుండా.. కేవలం తమ కార్య కర్తలకే ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నింటని వెంటనే అమలు చేయాలన్నారు. కాగా ఈ నిరసనకు వెళ్లకుండా పలువురుని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. నిరసన కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదీర్ బండారి, సీనియర్ నాయకులు మల్లికార్జున, విజేం దర్ రెడ్డి, పాటిల్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ పాటిల్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ సురేష్ పూరి, జైరాబాద్ మండల ప్రధాన కార్యదర్శి జగన్నాథం, పట్టణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




# పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలి



**నవతెలంగాణ-జహీరాబాద్**

పత్తి పంటలో రసం పీల్చే పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని ఏడీఏ బిక్షపతి అన్నారు. మండలంలోని డిడిగి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి పత్తి పంటను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి పంటలో తీసు కోవాల్సిన చర్యలను రైతులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో అత్యధిక విస్తీర్ణంలో పత్తి పంట సాగు అవుతుందన్నారు. ఈసారి జూన్‌లో తొలకరి వర్షాలు ఆలస్యమై, జూలైలో ఒకే వారంలో అధిక వర్షాలు, ఆగస్టులో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా పత్తి పంట ఎదుగుదల అంతా ఆశాజ నకంగా లేదన్నారు. ఈ ప్రతికూల పరిస్థితిని అధిగమిం చడానికి పోషకాల పిచికారీ చేపట్టాలన్నారు. దీనిలో భాగంగా మల్టీ-కె (13-0-45) లేదా ఫార్ములా-4 లాంటివి 5గ్రా./ లీటర్ నీటిలో కలిపి స్ప్రే పంపుతో పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుత బెట్ట మరియు అధిక ఉష్ణోగ్రత ఉన్నందున పేనుబంక, తామర పురుగుల ఉనికిని గమని ంచా మని.. దీని నివారణకు రసాయన పురుగు మంద ులతో వేప నూనె 5ఎం ల్ లీటర్ నీటిలో కలిపి వాడాలన న్నారు. రసాయన పురుగు మందుల్లో భాగంగా ఇమిడాక ్లోప్రిడ్ 0.25 ఎంల్ 0.2 గ్రా. లేదా డైపెన్ థయురాన్ 1.25 గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచకారీ చేసుకోవాలన్నారు. తెల్లదోమ నివారణకు మందుల పిచికారీతో పాటు పసుపు రంగు జిగురు అట్టలను (ఎల్లో స్టికీ ట్రాప్స్) ఏకరానికి 10 చొప్పున అమరిస్తే తెల్లదోమ జిగురుకు అంటుకొని చనిపోతాయన్నారు. ఇలాంటి నివారణ చర్యలతో పత్తిలో అధిక దిగుబడులు సాధించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతులు పాల్గొన్నారు.

# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**నవతెలంగాణ-సంగారెడ్డి**

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కోసం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జెఆర్ఆర్ గార్డు ఫంక్షన్ హాల్‌లో 'సంగారెడ్డి జిల్లా రెడ్ల ఆవేదన సభ' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అప్పమ్మ రామిరెడ్డి, రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి.. రెడ్డిలా ఓట్ల ద్వారా గద్దెనెక్కి నాలుగున్నర ఏండ్లు గడు స్తున్నా.. కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా రెడ్డిలను అణిచి వేసే కుట్ర పన్నుతున్నాడన్నారు. మెదక్‌లో జరిగే కెసిఆర్ బహిరంగ సభలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్యను కూడా ప్రకటించాలన్నా రు. 60 ఏండ్లు దాటిన రైతులకు 5000 పింఛన్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. రెడ్డి గురుకులాలను కూడా ఏర్పా టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమ తదనంతరం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి ఎక్స్ రోడ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షులు బుట్టంగారి మాధవరెడ్డి, రాష్ట్ర యువత వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్ రెడ్డి, గారుమేడ్చల్ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, నిజాంబాద్ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకురాలు రాధికా రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణు వర్ధన్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బాల కృష్ణారెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, పాండురంగారెడ్డి, మనోజ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వీరారెడ్డి కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## రేజింతల్ ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

**నవతెలంగాణ-న్యాల్‌కల్**

మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక ఆలయాన్ని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి బుధవారం సందర్శించారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రేజింతల్ సర్పంచ్ కుతుబోద్దిన్ మర్యాదపూ ర్వకంగా శాలువాతో సన్మానించారు. ఆయన వెంట జహీరాబాద్ ఆర్డిఓ వెంకరెడ్డి, స్థానిక సర్పంచ్ కుతుబోద్దిన్, న్యాల్‌కల్ తహసిల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ నాగభూషణం, రాంప్రసాద్ ఉన్నారు.



## కస్తూర్బా విద్యార్థులు శాస్త్రవేత్తల స్థాయికి ఎదగాలి

**నవతెలంగాణ-మద్దూరు**

కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు శాస్త్రవేత్తలుగా తయారై దేశానికి సేవలు అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయక ులు దొంతిరి నరసింహారెడ్డి అన్నారు. మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశా లలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద ఆదేశాల మేరకు దొంతిరి నరసింహారెడ్డి చంద్ర యాన్-3 ల్యాండింగ్‌ను విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా వీక్షించేందుకు ఏర్పాటు చేశారు. అనంత రం ఆయన మాట్లాడుతూ.. ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 ల్యాండింగ్ విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు ఇస్రో శాస్త్రవ ేత్తలు భారతదేశ శాస్త్ర సాంకేతిక విజ్ఞాన ఔన్నతా ్యన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పడం గర్వంగా ఉందన్నారు. చంద్రయాన్ 3 విజయవంతంలో మహిళల ఎంతో ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు అరటి పండ్లు స్నాక్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు విద్యాబు ద్ధులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ స్వప్న, ఎంపీటీసీ బోప్ప కనకమ్మ నాగయ్య, మాజీ ఉపసర్పంచ్ నీలా బాలకృష్ణ, వార్డు సభ్యు లు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## జహీరాబాద్ కాంగ్రెస్ టిక్కెట్ కోసం బేగరి నరేష్ దరఖాస్తు

**నవతెలంగాణ-జహీరాబాద్**

జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ఝురాసంగం జెడ్పీటీసీ బేగరి నరేష్ హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ గాంధీభవన్‌లో బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. గతంలో మేడపల్లి సర్పంచ్‌గా, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడుగా 2 సార్లు, ప్రస్తుతం డిజిటల్ సభ్యత్వం కోఆర్డినేటర్ గా వ్యవహారిస్తున్నారు. కార్యక్రమంలో నరేష్ తండ్రి గాలయ్య , రాచన్న గొడిగారపల్లి , నవీన్ పాటిల్ , శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు నిరసన సెగ

**విపక్షాలు, విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు**
**ఎమ్మెల్యె క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ నేతలు**



**నవతెలంగాణ - మెదక్**

మెదక్ సీఎం పర్యటన నేపథ్యంలో నిరసన కారులను పోలీసులు ముందస్తు అరెస్టు లు చేశారు. మంగళవారం అర్థ రాత్రి నుంచే బిజేపి, కాంగ్రెస్, సీపీఎం వంటి వామపక్షాలతో పాటు ఎస్ఎఫ్ఐ, ఏబివిపి విద్యార్థి సంఘాల నాయకులను సీఎం సభను అడ్డుకుంటారనే సమాచారంతో అరెస్టు చేశారు. బుధవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బిజెపి శ్రేణులు ప్లకార్డులతో ముట్టడించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి నిరసనకారులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి గత తొమ్మిదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి చేయలేదని, హామీలను నెరవేర్చిన తరువాతనే మెదక్ లో అడుగుపెట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

**నవతెలంగాణ నార్సింగి**

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ప్రకటించిన అనంతరం జరుగుతున్న తొలి బహిరంగ సభా కావడంతో మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి,ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, మంత్రి హరీష్ రావు లు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన సీఎం కెసిఆర్ భారీ బహిరంగ సభకు మండల వ్యాప్తంగా నాయకులు, ప్రజలు భారీగా తరలి వెళ్లారు. మండల కేంద్రంలో బుధవారం జెడ్పిటిసి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం భారీ బహిరంగ సభకు నార్సింగి మండలం నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు వివిధ వాహనాలలో తరలి వెళ్లారు. నార్సింగి మండలం నుండి నుంచి 70 కి పైగా వాహనాల్లో ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు గ్రామాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జడ్పిటిసి బానపురం కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చిన్న జిల్లాలు, చిన్న మండలాలు చేసి పరిపాలన సౌలభ్యం చేశారని అన్నారు. మెదక్ జిల్లాలో మొదటి సారీ సీఎం సభను ఏర్పాటు చేసినందుకు, పలు కార్యాలయాల ప్రారంభోత్సవం చేపట్టినందుకు కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు. మూడోసారి కెసిఆర్ ను ముఖ్యమంత్రిని చేయాలని కంకణం కట్టుకున్న మండల ప్రజలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలం లోని జప్తి శివనూర్ గ్రామానికి చెందిన మ్యాకల నర్సింగ్ రావు ఒంటి పై గులాబీ రంగు పూసుకుని, కెసిఆర్ ముఖ చిత్రం వేసుకుని కెసిఆర్ పై తన అభిమానాన్ని చాటుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. సీఎం బహిరంగ సభకు జడ్పిటిసి కృష్ణా రెడ్డి తో పాటు, ఎంపిపి లు, ఎంపీటీసీ సత్యనారాయణ, ఆకుల సుజాత, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు ఏర్రం అశోక్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, మండల మైనారిటీ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ ఖాదర్, జామియా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు చాంద్ ఖురేషి, వివిధ కుల సంఘాల అధ్యక్షులు, అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డ్ మెంబర్లు, సొసైటీ చైర్మన్లు, రైతు సంఘం నాయకులు, డ్వాక్రా గ్రూప్ సభ్యురాళ్ళు, బహిరంగ సభకు తరలి వెళ్లారు.

## కేసీఆర్ సభ కోసం బీజేపీ నాయకులు అరెస్టు చేయడం అన్యాయం



**నవ తెలంగాణ-టేక్మాల్ :** కేసీఆర్ సభ సందర్భంగా మండలంలో రాత్రి మూడు గంటలకు మండల బీజేపీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని బీజేపీ నాయకులు అన్నారు. బీజేపీ నాయకులకు పోలీసులు అరెస్టు చేసి పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎన్నడు లేని విధంగా కేసీఆర్ సభకు భారీ బందోబస్తు ఉన్నప్పటికీ, రాత్రి మూడు గంటలకు అక్రమంగా మండల బీజేపీ నాయకులను అరెస్టు చేయడం తీవ్ర అన్యాయమన్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నదని, కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. బీజేపీ నాయకుల అరెస్టు కేసీఆర్ ప్రభుత్వ అవినీతికి పరాకాష్ట అని వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ఓటమి తప్పదని, తెలంగాణలో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాయికోటి శామయ్య, మెదక్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు రెడ్యానాయక్, టేక్మాల్ మండల అధ్యక్షులు ఎల్లుపెట్ రాజు, టేక్మాల్ పట్టణ అధ్యక్షులు సిద్దిరాములు మండల బీజేపీ నాయకులు శివగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం

**ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**
**నవతెలంగాణ - మెదక్**

రాజకీయ భిక్ష పెట్టిన సీఎం కేసీఆర్ కు పాదాభివందనం చేస్తున్నట్లు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం సీఎం కేసీఆర్ మెదక్ ల ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. 2004 నుంచి ఇప్పటివరకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించి నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చి రాజకీయ భిక్ష పెట్టిన సీఎం కేసీఆర్ కు పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. 2014లో సీఎం ఇచ్చిన మాట ప్రకారం మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపినట్లు తెలిపారు. మెదక్ ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడంతో పాటు రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసిన ఘనత, ఏడుపాయలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్ కు దక్కిందన్నారు. ఘనపూర్ ఆనకట్ట గత పాలకులు నిర్లక్ష్యం చేస్తే, కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సీఎం ఆశీస్సులతో ప్రజలకు సేవలు అందించి రుణం తీర్చుకుంటాను అని తెలిపారు.



# జననేతకు జన నీరాజనం

- గులాభిమయంగా మారిన మెదక్
- వేలల్లో తరలివచ్చిన ప్రజలు

**నవతెలంగాణ - మెదక్**

ఉద్యమ నాయకుడు, తెలంగాణ రథసారథి, జననేత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కు జననీరాజనం పలికారు. బుధవారం మెదక్ లో జరిగిన ప్రగతి శంఖారావ సభకు 60 వేలకు పైగా జనం తరలివచ్చారు. మెదక్ జిల్లా కేంద్రం ఎటుచూసినా గులాబీమయమైంది. రోడ్డుకిరువైపులా గులాబీ జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు దర్శనమిచ్చాయి. వేలాది జనం జై తెలంగాణ, కేసీఆర్ జిందాబాద్ అంటూ ప్రజలు నినాదాలు చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నుంచి సీఎం కు అడుగడుగునా ప్రజలు పార్టీ జెండాలు, ప్లకార్డులతో స్వాగతం పలికారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండుటెండలో సభ ప్రాంగణంలో ఎంతో ఓపికగా ఉన్నారు. సీఎం కేసీఆర్ బహిరంగ సభకు చేరుకొని ప్రసంగం మొదలుపెట్టినప్పటి నుంచి అభిమానులు జై కేసీఆర్, జై తెలంగాణ అని నినాదాలు చేశారు. వేల సంఖ్యలో ప్రజలు చేరుకోవడంతో పలు చోట్ల తోపులాట జరిగింది. ప్రెస్ గ్యాలరీ ప్రాంగణంలో జరిగిన తోపులాట కాస్త ఉద్రిక్తతకు దారి తీసింది.











## బీఆర్ఎస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి**
**నవతెలంగాణ పుల్కల్**

గత తొమ్మిది సంవత్సరాలుగా పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని కాంగ్రెస్ పార్టీ పుల్కల్ మండల అధ్యక్షులు దుర్గా రెడ్డి అన్నారు బుధవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకల్ పేరుతో నెగ్గిన చంటి క్రాంతి కిరణ్ ఆందోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలం చెందారని ఆయన ఎద్దేవ చేశారు స్వార్థ ప్రయోజనాల కోసం ఆందోల్ నియోజకవర్గంలో వేలఎకరాల భూమిని అన్యాక్రాతంగా కబ్జా చేయడమే కాకుండా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చకపోవడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గం లో చేసిన పనులే నేటికీ నిదర్శంగా నిలిచ రా న్నారు ఆందోల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మళ్లీ తమ నేత దామోదర్ రాజనర్సింహ వస్తేనే మళ్లీ అందోల్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు ఆచరణలో సాధ్యం కానీ హామీలు ఇచ్చి ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చకపోవడంలో చంటి క్రాంతి కిరణ్ ముందంజలో ఉన్నా రా న్నారు కావున రాబోయే ఎన్నికల్లో ఇప్పుడున్న క్రాంతి కిరణ్ కు గుణపాఠం చెప్పి మాజీ డిప్యూటీ సీఎం అయిన దామోదర్ రాజనర్సింహ అత్యధిక మెజార్టీతో గెలపొదడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు ఇప్పటివరకు ఆందోల్ నియోజకవర్గాన్ని పాలించిన పాలకులు ఏమి చేశారో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు ఇప్పుడున్న ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ స్వార్థ ప్రయోజనాల కోసం తమ సోదరులను రంగంలో దించి ఏ ఒక్క గ్రామం విడవకుండా ఆందోల్ నియోజకవర్గం లో ఉన్న అన్ని గ్రామాలలో వేల ఎకరాల భూములను అన్యాక్రాంతంగా కబ్జాలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు ఇలాంటి వ్యక్తిని మళ్లీ గెలిపిస్తే మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజల ఇండ్లను కూడా కబ్జా చేయడం ఖాయమని ఆయన అన్నారు కావున ఆందోల్ నియోజకవర్గంన్ని ఎవరు వస్తే అభివృద్ధి చెందుతుందో ఓటర్లు గమనించి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని వారు అన్నారు .

## కొల్చారంలో సీఎం కేసీఆర్‌కు ఘనస్వాగతం

**నవతెలంగాణ- కొల్చారం**



మెదక్ లో నిర్వహించే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు సీఎం కేసీఆర్ బుధవారం కొల్చారం జాతీయ రహదారి మీదుగా వెళ్లారు. దీంతో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఫొటోలతో రోడ్డుకు ఇరువైపులా ఉండి ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఘనస్వాగతం పలికారు. దీంతో సీఎం కేసీఆర్ కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు. అంతకుముందు ఆయా గ్రామాల సర్పంచుల, ఎంపీటీసీ ల ఆద్వర్యంలో ప్రజలు అధిక సంఖ్యలో బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అద్యక్షుడు గౌరీశంకర్, సర్పంచుల ఫోరం మండల అద్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ వీరారెడ్డి, యూత్ నాయుడు రవితేజ రెడ్డి, కాశీనాథ్, సంతోష్ రావు, అంజనేయులు, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి

**నవ తెలంగాణ-మెదక్ టౌన్**

- ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యాటన గుమ్మడిదల, నరాసపూర్ మీదుగా మెదక్‌కు చేరుకున్నారు.
- ముఖ్యమంత్రికి గుమ్మడిదల వద్ద ఘనంగా స్వాగతం పలికారు.
- అనంతరం మంభోజిపలి వద్ద పువ్వులు చల్లి ప్రజలు ఘన స్వాగతం పలికారు.
- బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని 2:55 నిమిషాలకు ప్రారంభించారు.
- అనంతరం 3: 15 నిమిషాలకు ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు.
- కలెక్టర్ కార్యాలయాన్ని 3:35 నిమిషాలకు ప్రారంభించారు.
- అక్కడి నుండి బహిరంగ సభ వద్దకు 5:10 నిమిషాలకు చేరుకున్నారు.
- ప్రజలనుదేశించి ప్రసంగిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు జరిగినట్లు పేర్కొన్నారు.
- బీడీ కార్మికురాలికి 2016 రూపాయల చెక్కులు సిఎం చేతుల మీదుగా అందజేశారు.
- మెదక్ మున్సిపాలిటీకి 50 కోట్ల రూపాయలను మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారు.
- మిగతా మున్సిపాలిటీలకు 20 కోట్ల రూపాయలు చొప్పున మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

సిద్దిపేట

8

నవతెలంగాణ

గురువారం 24 ఆగస్టు 2023


## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**నవతెలంగాణ-నర్సాపూర్**

మండల కేంద్రమైన శివంపేట గ్రామానికి చెందిన దండేలి నాగయ్య, మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ పద్మా వెంకటేష్, వార్డు సభ్యులు పోచ గౌడ్, కాలనీ వాసులు ప్రవీణ్, పోచయ్య వంశీ, నర్సింలు, రాజు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



## ముప్పిరెడ్డిపల్లిలో గ్రామ దేవతలకు బోనాల ఉత్సవాలు

**నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్**

మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం గ్రామదేవతలకు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సర్పంచ్ నరాల ప్రభావతి పెంటయ్యల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా బొడ్రాయి స్థాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం నుంచి ప్రారంభమైన బొడ్రాయి మహోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించగా బుధవారం గ్రామదేవతలకు బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు గ్రామంలోని గ్రామదేవతలకు బోనాలను సమర్పించేందుకు ర్యాలీగా డప్పు చప్పుళ్ళ మధ్య తరలి వెళ్లి భక్తిశ్రద్ధల మధ్య గ్రామదేవతలకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలు సిద్ధం

- ఏఐసీసీ సెక్రటరీ క్రిస్టోఫర్ తిలక్

**నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్**

రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్ద దించడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి కృష్టఫర్ తిలక్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, ప్రజలను మభ్య పెట్టిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించటానికి ప్రజలు సన్నద్ధులై ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చకపోగా బూటకపు మాటలతో ప్రజల్ని కెసిఆర్ మోసం చేశారన్నారు. నీళ్ల నిధులు నియామకాలు అని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ కేవలం కుటుంబ పాలనను సాగిస్తున్నాడని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేసీఆర్ మహానటులన్నారు. ప్రజలకు సేవలు చేయడం మానేసి, ప్రజలకు ఉపాధిని కల్పించకపోగా , మీడియా ముందుకు వచ్చి ప్రజలకు వినోదాన్ని పంచాలని చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల దృష్టి మళ్లించి ఓట్లు దండుకోవాలని కేసీఆర్ చూస్తున్నాడన్నారు. స్థానిక ఎమ్మెల్యే సతీష్ కుమార్ పై వ్యతిరేకత చాలా ఉందని, కాంగ్రెస్ చేతిలో ఓటమి ఖాయమని అన్నారు. గౌరవెల్లి గండేపల్లి ప్రాజెక్టులు పూర్తి చేయని అసమర్థుడన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటికి తీసుకువెళ్లి ప్రజలను చైతన్య పరచి కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడానికి కృషి చేయాలన్నారు. రాహుల్ గాంధీ సభలో ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్ ను, హైదరాబాద్ ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్‌ను ప్రచారం చేయాలని సూచించారు.




### హుస్నాబాద్ అభివృద్ధి శూన్యం

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

గత పది సంవత్సరాలుగా హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని మాజీ పార్లమెంటు సభ్యులు పొన్నం ప్రభాకర్ అన్నారు . .హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీ మాటలకే పరిమితం అవుతుందన్నారు. హుస్నాబాద్ ను సిద్దిపేట జిల్లాలో కలపవద్దని ప్రజలంతా వ్యతిరేకించినా, సిద్ది పేట జిల్లాలో కలిపారని, ఇదే జిల్లా లో ఉన్న పక్క నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంటే, ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఏం చేస్తున్నారన్నారు. పార్లమెంటు విషయానికొస్తే ఎంపి బండి సంజయ్ మాటలకే పరిమితం అవుతున్నారని, ఒక్క పైసా కూడా అభివృద్ధి చేయటం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని నాయకులు కార్యకర్తలు ఐక్య మత్యంగా పనిచేసి పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యకమంలో పార్లమెంటు పరిశీలకు దొమ్మాట సాంబయ్య, కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, టిపిసిసి ఉపాధ్యక్షురాలు నేరెళ్ల శారద, సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పడాల రాహుల్ మండల అధ్యక్షుడు బంక చందు తదితరులు పాల్గొన్నారు.

## కెనాల్‌లో జింక

- రక్షించిన అటవీశాఖ అధికారులు



**నవతెలంగాణ-తొగుట**

ప్రమాద వశాత్తు దుబ్బాక కెనాల్‌లో జింక పడిందని అటవీశాఖ బీట్ ఆఫీసర్ రాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుండి దుబ్బాక వెళ్లే కాలువ (కెనాల్)లో ప్రమాద వశాత్తు జింక పడిం దని స్థానికులు సమాచారం అందించారని అన్నారు. సిబ్బంది గణేష్, స్థానికుల సహాయంతో బయ టకు తీసి ప్రథమ చికిత్స చేసి అడవిలో వదిలి పెట్టామని తెలిపారు.

## తహసీల్దార్ దివ్య బాధ్యతల స్వీకరణ

**నవతెలంగాణ రాయపోల్**

రాయపోల్ మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఉమారాణి బదిలీపై రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లారు. అప్పటి నుండి తాత్కాలికంగా దౌల్తాబాద్ మండల డిప్యూటీ తహసీల్దార్ జహీర్ మోహినుద్దీన్ ఇంచార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న దివ్య పదోన్నతిపై రాయపోల్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్లప్పుడూ మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కారం చేసి రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తానన్నారు. అలాగే ఇప్పటి వరకు పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పై అధికారుల సహకారం తోటి పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలు పెండింగ్ లేకుండా భూముల రిజిస్ట్రేషన్, విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రైతులకు పట్టా పాసు పుస్తకాలు, రైతు బంధు చెక్కులు ఇలాంటి పనులన్నీ వెంట వెంటనే పూర్తి చేస్తామన్నారు. అనంతరం కార్యాలయ అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు ప్రజలకు జవాబుదారీ తనంగా ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పనులు చేయాలని సూచించారు.



## గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలి



**నవతెలంగాణ రాయపోల్**

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించే పీడిత ప్రజల గొంతుక ప్రజా యుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. బుధవారం రాయపోల్ మండలం వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గద్దర్ యాదిలో సంస్కరణ సభ పోస్టర్ విడుదల చేశారు.ఆయన మాట్లాడుతూ గద్దర్ జీవితమంత అణగారిన, పీడిత ప్రజల కోసం పోరాటం చేస్తూనే ప్రజలను చైతన్యం చేస్తూ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తన జీవితమే త్యాగం చేశాడని ఆయన నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. గద్దర్ స్ఫూర్తిగా నేటితరం చైతన్యవంతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 వ తేదీన గురువారం సాయంత్రం 5 గంటలకు గద్దర్ సంస్మరణ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు నర్సింగరావు, తులసీదాస్, మెట్ట య్య, మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్, శ్రీనివాస్, వేణు పాల్గొన్నారు

## మహారాష్ట్రకి చెందిన 150 మంది సర్పంచ్‌ల బృందం కోమటిబండ మిషన్ భగీరథ ప్లాంటు సందర్శన



**నవతెలంగాణ- గజ్వేల్**

మహారాష్ట్ర కి చెందిన 150 మంది సర్పంచులు, వారి ప్రతినిధులు కోమటిబండ మిషన్ భగీరథ ప్లాంటును బుధవారం సందర్శించారు. మిషన్ భగీరథ ఉద్దేశం, ప్రణాళిక, నీటి శుద్దీకరణ, నీరు సరఫరా తీరు, మిషన్ భగీరథ అమలు, నాణ్యత గురించి క్షుణ్ణంగా వివరించినట్లు మిషన్ భగీరథ అధికారి నాగార్జున తెలిపారు. మిషన్ భగీరథ పథకం బాగుందని కితాబ్ ఇచ్చినట్లు చెప్పారు.

## బీసీలను చిన్నచూపు చూడడం సీఎం కేసీఆర్‌కు తగదు

- టీడీపీ రాష్ట్ర నాయకులు ఒగ్గు రాజు

**నవతెలంగాణ-చేర్యాల**

బీసీలను సీఎం కేసీఆర్ చిన్న చూపు చూడడం తగదని తెలుగుదేశం రాష్ట్ర నాయకులు ఒగ్గు రాజు అన్నారు. చేర్యాల మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఒగ్గు రాజు మాట్లాడుతూ తెలంగాణ లో బీసీల శాతం తెలిసి కూడా బీసీలకు అతి తక్కువ సీట్లు కేటాయించడం బీసీ ల పట్ల బీఆర్ఎస్ కు ఉన్న ప్రేమ అర్థం అవుతుందని అన్నారు. బీసీలలో కొన్ని రాజకీయంగా వెనుకబడిన కులాలు చాలా ఉన్నాయని వాటిని గుర్తించి రాజకీయపరంగా చైతన్యం చేయవలసిన బాధ్యత ఆ పార్టీ పైన ఉందన్నారు. తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటినుండి ఉద్యమాన్ని ముందుండి నడిపిన బీసీ వర్గాలను అణచివేసి అగ్రవర్గాల వారికి పదవులు కట్టబెడుతున్నారని, ఉద్యమంలో లేని చాలామంది ఉన్నత పదవులు అనుభవిస్తున్నారని తెలిపారు.కేసీఆర్ కులాల పేరుతో విభజన చేసి వృత్తి పరమైన పరికరాలను, మూగ జీవాలను బీసీ కులాలకు ఇచ్చి అడవులలోనే ఉండాలనే ఆలోచన సరికాదన్నారు. బీసీ కులాలను మోసం చేస్తూ 9 సంవత్సరాలు పబ్బం గడిపారని విమర్శించారు. ఈసారి బీసీలు ఏకమైతే బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా కొట్టుకపోవడం నిజమనేది అతి కొద్ది రోజుల్లోనే తేలిపోతుందన్నారు. తెలుగుదేశం పార్టీని ప్రజలు ఆదరించి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తమ పార్టీకి ఓటు వేయాలని కోరారు.



## తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు



**నవతెలంగాణ-మర్కుక్**

ఇటీవల మర్కుక్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రావు బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. బుధవారం మర్కుక్ మర్కుక్ రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గడీల కవిత బాల్ నర్సయ్య, దాచరి సంజీవయ్య ఆధ్వర్యంలో తహసీల్దారు చంద్రశేఖర్ రావు ను మర్యాద పూర్వకంగా కలిసి పూల గుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు బాగ్యరేఖ, మండల రేషన్ డీలర్లు గౌరవ అధ్యక్షులుపద్మ భాస్కర్ రెడ్డి, వివిధ గ్రామాల రేషన్ డీలర్లు ఎన్ .రజని, వైకుంఠం , మంద ముత్యంరెడ్డి ,ఉడుత వెంకటేశం ,సంఘ నవీన్, మాడబోయిన చంద్రయ్య ,వై చంద్రకళ, ఎం .పద్మ మమత ,కనకయ్య, గణేష్, తదితరులున్నారు.

## బీజేపీ బలోపేతానికి కృషి



**నవతెలంగాణ-తొగుట**

క్రమశిక్షణ కార్యకర్తగా నియమనిబంధనలతో పనిచేస్తానని, పార్టీ సూచన మేరకు పనిచేస్తానని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే రఘునందన్ రావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు, రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి



**నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్**

రెండో ఏఎన్ఎంల సమస్యలను వెంటనే పరిష్కరించి రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో ఏఎన్ఎంలు సమస్యలు పరిష్కరించాలని గత ఎనిమిది రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఏఎన్ఎంల పోస్టులో భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని దాన్ని వెంటనే రద్దుచేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో కొనసాగుతున్న వారిని రెగ్యులరైజ్ చేసి స్కేల్ ప్రకారం జీతాలు చెల్లించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. పరిష్కరించకపోతే వారికి అండగా నిలబడి రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళనలో ఉధృతం చేస్తామని హెచరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి బెక్కంటి సంపత్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## మండలస్థాయి ఎస్జిఎఫ్ క్రీడా పోటీలు

**నవతెలంగాణ-తొగుట:**

మండల పరిధిలో ఎస్జిఎఫ్ క్రీడాపోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ ఎస్.యాదవరెడ్డి తెలి పారు. బుధవారం ఆయన లేకరులతో మాట్లాడుతూ మండల స్థాయి యెస్జిఎఫ్ క్రీడాపోటీలు వచ్చే నెల సెప్టెంబర్ 4న స్థానిక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరవహిస్తామ న్నారు.ఈ క్రీడల్లో అండర్ 14, 17 బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు టీంల వారిగా తమ ఎంట్రీ ఫామ్స్ ఈనెల 31 లోగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొగుటలో మండల యెస్జిఎఫ్ సెక్రటరీ సి హెచ్.మురళీధర్ కు అందజేయాలని సూచించారు.



## మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

**నవతెలంగాణ-నంగునూరు**

మండల కేంద్రమైన నంగునూరు లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని మంగు వారి ధార్మిక సంస్థ చైర్మన్ మంగు రాధా కిషన్ రావు, ఆలయ నిర్వహణ కమిటీ బాధ్యులు తెలిపారు.బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25,26,27వ తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.27న శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

## మైనంపల్లి బహిరంగ క్షమాపణ చెప్పాలి

**నవతెలంగాణ-కోహెడ**

మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వాఖ్యలు చేసిన మైనంపల్లి హనుమంతరావు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ప్యాక్స్ ఛైర్మన్ పెర్యాల దెవేందర్‌రావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనలో మంత్రి హరీశ్‌రావు ఎంతగానో కృషి చేశారని గుర్తుచేశారు. పార్టీలు మారిన చరిత్ర నీదని ఇప్పటికైన బేషరతుగా క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ప్రజలు నీకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



## మంత్రి హరీశ్‌రావును విమర్శించే స్థాయి మైనంపల్లికి లేదు



**నవతెలంగాణ-మిరు దొడ్డి**

మంత్రి హరీశ్‌రావును విమర్శించే స్థాయి మైనంపల్లి హనుమంతరావుకు లేదని ఎంపీపీ గజ్జల సాయిలు సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు తుమ్మల బాలరాజు అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తూ పేద ప్రజల అభ్యున్నతకై పనిచేస్తున్న నాయకుడు హరీష్ రావు అని అన్నారు. నేడు స్వార్థ రాజకీయం కోసం హనుమంతరావు హరీష్ రావు పై అనుచిత వాక్యాలు చేయడం ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సూకురి లింగం, సల్లూరి మల్లేశం రాములు తోకల నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జామియా మస్జిద్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



**నవతెలంగాణ-నార్సింగి**

మండల కేంద్రంలోని జామియా మస్జిద్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి, సర్పంచ్ ఎర్రం అశోక గుప్తా, జామియా కమిటీ అధ్యక్షుడు ఎండీ చాంద్ ఖురేషిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని కులాల, మతాల వారి అభివృద్ధియే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. నిర్మాణ పనులకు రూ.10 లక్షల ఎంపీ నిధులను మంజూరు చేసిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి, అందుకు సహకరించిన మంత్రి హరీష్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. జామియా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ చాంద్ ఖురేషి మాట్లాడుతూ ఇప్పటివరకు మండల ముస్లిం మైనారిటీలకు ఏ విధమైన నిధులు మంజూరు కాలేవని, ఇదే తొలిసారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, సర్పంచ్, కమిటీ అధ్యక్షుడితో పాటు ఎంపీటీసీ సత్యనారాయణ, మండల బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, పార్టీ మండల మైనారిటీ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ ఖాదర్, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేష్ గౌడ్, వార్డు సభ్యులు ఎండీ ఫరీద్, ఎండీ జమీర్, ఏ.ఎం.సి మాజీ డైరెక్టర్ రబ్బానీ, ఎస్ఎంసి చైర్మన్ బాఖర్, పార్టీ సీనియర్ నాయకుడు శ్రీపతి రావు, పార్టీ యూత్ నాయకుడు రాజశేఖర్, ఖాసిం, అబ్దుల్ గాఫ్ఫార్, యూసుఫ్, ఇమ్రాన్, ముజీబ్, ఏజ్డాని తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి టికెట్ రావాలని దుర్గమ్మ తల్లికి మొక్కు



**నవతెలంగాణ-చేర్యాల**

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కి మూడోసారి ఎమ్మెల్యే టికెట్ రావాలని బుధవారం చేర్యాల మండల పరిధిలోని వీరన్న పేట గ్రామంలో ఉన్న దుర్గమ్మ దేవాలయం లో అమ్మవారికి బీఆర్ఎస్ నాయకులు మొక్కుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉల్లంపల్లి కరుణాకర్,చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీవ్ రెడ్డి, వీరన్న పేట సర్పంచ్ కొండపాక బిక్షపతి, ఎంపిటిసి శివశంకర్,పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అరిగె కనకయ్య, ఉపాధ్యక్షులు సాతల్లి బాలస్వామి, కొండపురం మధు, మాజీ సర్పంచ్ వల్లూరు శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి పెద్దింటి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**నవతెలంగాణ-చేర్యాల**

చేర్యాల మండల పరిధిలోని తాడూరు గ్రామంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మంజూరు చేసిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు బుధవారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్ర ప్రేమలత-మహేందర్ రెడ్డి ఎంపిటిసి మిట్టపల్లి సులోచన,పీఏసీఎస్ మాజీ చైర్మన్ బొడుగం మహిపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ ఈరు లక్ష్మణ్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఈరు ఐలయ్య, ఉపేందర్ రెడ్డి, విజేందర్ రెడ్డి, పవన్, సంపత్, మైపాల్ రెడ్డి, రాజు, శీను, కనకయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.